www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
13-08-2024

సంపుటి : 01 | సంచిక : 101 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటీ మద్రాస్

### వరుసగా ఆరో ఏడాది అగ్రస్థానంలో

### 13 విభాగాల్లో ర్యాంకుల ప్రకటన

దేశంలో ఉత్తమ విద్యాసంస్థల జాబితాను విడుదల చేసిన కేంద్ర విద్యాశాఖ



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటి మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ), నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్‌ఎఫ్)లు సంయుక్తంగా నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటిస్తాయి. దేశంలో ఉత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. మొత్తం 13 విభాగాల్లో ర్యాంకుల జాబితాను ప్రకటించారు. ఇందులో 'ఐఐటీ మద్రాస్ '

మిగతా2లో...

## సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్

- సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ పిటిషన్
- అత్యవసర విచారణ జరపాలని కోరిన కేజ్రీవాల్ తరపు న్యాయవాది
- అభ్యర్థనను మెయిల్ కు పంపాలని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ సూచన



2



## రాష్ట్రంలో మెగా కారు టెస్టింగ్ సెంటర్

దక్షిణ కొరియా ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ దాని భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని యోచిస్తోంది. మెగా టెస్ట్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం (ఈవీలు సహా) ఉంటుంది. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకరణ, విస్తరణ ద్వారా హెచ్ఎంఐఈ భారతదేశం సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత ఉపాధిని కల్పించనుంది.

### ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ సంస్థ సంసిద్ధత

**హైదరాబాద్‌లో ఉన్న కేంద్రం పునరుద్ధరణ**

ఇంజనీరింగ్ సెంటర్ విస్తరణకూ పెట్టుబడులు.. పెరగనున్న ఉద్యోగ అవకాశాలు

హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం హెచ్ఎంఐఈ ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం తమకు చాలా ముఖ్యమైన మార్కెట్ అని, భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ సెట్టింగ్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. అత్యాధునిక పరీక్షా సౌకర్యాల అభివృద్ధి చేసేందుకు తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు హెచ్ఎంఐఈ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులను తెలంగాణలో పెట్టించేందకు తమ

మిగతా2లో...

## ఉపరాష్ట్రపతి రాక 16న

ఏర్పాట్లు చేయాలి: సీఎస్ ఆదేశం



2

## చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం భేటీ

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించింది. గత రెండు రోజులుగా అమరావతిలో పర్యటిస్తున్న ఈ బృందం.. రాజధాని ప్రాంతంలోని భవనాలు, రహదారులను పరిశీలించింది. ప్రపంచంలోని ఉత్తమ ప్రమాణాలు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి అమరావతి నిర్మిస్తున్నామని ఆ బృందానికి సీఎం వివరించారు.



2

## వినేశ్ ఫొగాట్‌దే తప్పు

- బరువు పెరగకుండా చూసుకోలేదు
- మెడికల్ టీం కేవలం అవగాహన కల్పించేందుకే
- స్పష్టం చేసిన ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్‌పర్సన్ పీటీ ఉష
- రజత పతకం ఇవ్వాలని వినేశ్ చేసిన అప్పీలుపై ఈ నెల 13న తుది తీర్పు



2

## కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం

- ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలనేదే ఆయన సంకల్పం
- వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు
- బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పూర్తి
- నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్ మంత్రులకు లేదు..
- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్



**హైదరాబాద్:** సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్ కు ఇష్టమైన ప్రాజెక్టు అని మాజీ మంత్రి, బీఆర్ఎష్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు కోసం సంకల్పం చేసింది కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా దాన్ని నిర్మించాలనుకున్నారని చెప్పారు. 30 వేల ఉద్యోగాల కథ ఎట్ల ఉన్నదో.. సీతారామ ప్రాజెక్టు కథ కూడా అట్లనే ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పూర్తయింది.. కానీ మేమే ఈ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు కాంగ్రెస్ నేతలు

మిగతా2లో...




2

## బౌద్ధ మహాస్థూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 80 | ₹ 102 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 148 | ₹ 168 |

## కబ్జా చేస్తే కటకటాలే

బాధ్యులెవరైనా చర్యలు తప్పవు

- నగరంలోని 57 చెరువులపై స్టడీ చేశాం
- 45 ఏళ్లలో 61 శాతం చెరువులు కబ్జా
- భారీ వర్షాలు కురిస్తే సిటీకి మునక తప్పదు
- ఏడు వేలకు పెరగనున్న హైడ్రా సిబ్బంది
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యలు



2



## ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలి

- ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగులే కారణం
- సీపీఎస్ నాలుగు రాష్ట్రాల్లో రద్దయింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను నిలబెట్టుకోవాలి
- 317 జీవోను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి టీఎన్జీవో ఐకాస విజ్ఞప్తి
- 15మందిలో ఏర్పాటైన స్టీరింగ్ కమిటీ

2

## ఎమ్మెల్సీ కవితకు చుక్కెదురు

మధ్యంతర బెయిల్‌కు సుప్రీం కోర్టు నిరాకరణ

ఈడీ, సీబీఐలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు

**ఢిల్లీ:** ఢిల్లీ మద్యం వ్యవహారంలోని ఈడీ, సీబీఐ కేసుల్లో ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా మధ్యంతర ఉపశమనం కల్పించలేమని స్పష్టం చేసింది. ప్రతివాదులుగా ఉన్న దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. వెంటనే విచారణ చేపట్టాలని కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోరారు. ఈనెల 20న విచారిస్తామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం స్పష్టం చేసింది.



## సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్

**ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టైన తనను విడుదల చేయాలని సోమవారం అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఎక్సైజ్ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్పై జూన్లో ఢిల్లీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు ఇది వ్యతిరేకంగా ఉందని పిటిషన్లో వెల్లడించారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కేజీవాల్ తరపు న్యాయవాది సుప్రీంను కోరగా తమకు మెయిల్ అభ్యర్థన పంపాలని భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజీవాల్ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఎన్నికల అనంతరం ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. కాగా ఈడీ అరెస్టు కేసులో సుప్రీం సీఎంకు జులై 12న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే ఇదే కేసులో సీబీఐ ఆయనను అరెస్టు చేయడంతో ప్రస్తుతం జైల్లోనే కొనసాగుతున్నారు.ఇదే కేసులో మొదట అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోదియాకు ఆగస్టు 9న సుప్రీం బెయిల్ మంజూరు చేసింది. కాగా రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్కు ఆరు నెలల కస్టడీ తర్వాత ఏప్రిల్లో అత్యున్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది.

## బౌద్ధ మహాస్థూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతాం

**నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని బౌద్ధ మహాస్థూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యానమందిరం, బౌద్ధ మహాస్థూపాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. స్థానిక బౌద్ధ మహాస్థూపం విశేషాలను పురావస్తు శాఖ, పర్యటక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.క్రీస్తుశకం రెండో శతాబ్దం నాటి ఈ స్థూపాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వెంటనే రోడ్మ్యాప్ తయారు చేసి డీపీఆర్ ను సమర్పించాలని భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి పర్యటకులను నేలకొండపల్లి ఆకర్షిస్తోందని, ఇంకా ఎక్కువ మంది ఈ కేంద్రాలను సందర్శించేలా వసతులు మెరుగుపరచాలని నిర్ణయించారు. అనంతరం భక్తరామదాసు నివాస స్థలం, ధ్యాన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ నూతనంగా నిర్మించనున్న ఆడిటోరియం నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు.

## ఉపరాష్ట్రపతి రాక 16న

**విశ్వంభర, హైదరాబాద్:** భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పర్యటన కు వస్తున్నందున తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటనకు సంబంధించి అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. 17వ తేదీన ఉదయం ఢిల్లీకి తిరుగు ప్రయాణం వరకు సంబంధిత విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని పోలీసు శాఖను ఆమె ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖకు సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్ ఎం.డిని ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, , ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంతరావు, పంచాయత్ రాజ్ శాఖ అధికారులు, ఆర్జీఐ ఎయిర్పోర్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మెగా కారు టెస్టింగ్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళిక రచిస్తోందన్నారు. రాష్ట్రం అనుసరిస్తున్న పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో ప్రగతిశీల, భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ఎంఐఈ వంటి అత్యుత్తమ-తరగతి కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. హెచ్ఎంఐఈ మెగా టెస్ట్ సెంటర్ సమీపంలోని సౌకర్యాలు ఇతర అనుబంధ సంస్థలు, సరఫరాదారులను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుంది.

# అత్యుత్తమ విద్యాసంస్థగా ఐఐటీ మద్రాస్

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ విద్యాసంస్థ (ఓవరాల్)గా వరుసగా ఆరో ఏడాది అగ్ర స్థానంలో నిలిచింది. ఇక, ఉత్తమ విశ్వవిద్యాలయాల విభాగంలో ఐఐఎస్ సీ బెంగళూరు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.నేషనల్ ఇన్స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ కింద రూపొందించిన ఈ జాబితాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ విడుదల చేశారు. యూనివర్సిటీలు, కాలేజీలు, రీసర్చ్ ఇన్స్టిట్యూషన్లు, ఇంజినీరింగ్, మేనేజ్మెంట్, ఫార్మసీ, మెడికల్.. ఇలా మొత్తం 13 విభాగాల్లో ర్యాంకులకు ప్రకటించారు. విద్యాసంస్థల్లో అందిస్తోన్న విద్యాబోధన, కల్పిస్తున్న సౌకర్యాల ఆధారంగా 2016 నుంచి ఈ ర్యాంకులను కేంద్రం ప్రకటిస్తోంది.




**ఎన్ఐఆర్ఎఫ్ 2024 ర్యాంకుల వివరాలు ఇలా..**

- మొత్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో.. ఐఐటీ మద్రాస్ మొదటి స్థానంలో ఉండగా.. ఐఐఎస్ సీ బెంగళూరు రెండు, ఐఐటీ బాంబే మూడో స్థానంలో ఉన్నాయి. టాప్ 10లో ఎనిమిది ఐఐటీలు ఎయిమ్స్ ఢిల్లీ, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చోటు దక్కింది.
- విశ్వవిద్యాలయాల పరంగా.. ఐఐఎస్సీ బెంగళూరు, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామియా మిలియా ఇసామియా మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నాయి.
- కళాశాలల విభాగంలో.. హిందూ కాలేజీ, మిరాండా కాలేజీ, సెయింట్ స్టీఫెన్ కాలేజీ టాప్ 3లో ఉన్నాయి. ఇవన్నీ ఢిల్లీలోనే ఉన్నాయి.
- ఇంజినీరింగ్ విభాగంలో.. ఐఐటీ మద్రాస్ వరుసగా 9వ సారి మొదటి స్థానం దక్కించుకుంది. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఐఐటీ హైదరాబాద్ ఎనిమిదో స్థానంలో ఉంది.
- మేనేజ్మెంట్ విభాగంలో.. ఐఐఎం అహ్మదాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోళికోడ్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.
- ఫార్మసీ విభాగంలో.. జామియా హమ్ దర్ద్ (ఢిల్లీ) మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రెండో స్థానం దక్కించుకుంది. బిట్స్ పిలానీ మూడో స్థానంలో నిలిచింది.
- వైద్య విద్యలో.. ఢిల్లీలోని ఎయిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. చండీగఢ్లోని పోస్ట్ గ్యాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్), వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- డెంటల్లో... మొదటి స్థానంలో చెన్నైలోని సవీత ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్, రెండో స్థానంలో మణిపాల్ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, మూడో స్థానంలో ఢిల్లీలోని మౌలానా ఆజాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెన్స్ నిలిచాయి.
- పరిశోధన విద్యాసంస్థల్లో.. ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో.. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఢిల్లీ) తొలి స్థానంలో ఉండగా.. కర్నాల్లోని ఐసీఏఆర్, లూధియానాలోని పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.
- ఆవిష్కరణల విభాగంలో.. ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.
- స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీల్లో.. చెన్నైలోని అన్నా యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆరు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఏడు స్థానాలు దక్కించుకున్నాయి.
- న్యాయవిద్యలో.. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా వర్సిటీ, ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ, హైదరాబాద్లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ లో.. ఐఐటీ రూర్కీ, ఐఐటీ ఖరగ్పూర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ టాప్ 3 ర్యాంకులు సాధించాయి.

# కబ్జా చేస్తే కటకటాలకే

**విశ్వంభర, హైదరాబాద్:** ట్రై సిటీలోని నాలాలు, చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే బాధ్యులపై కఠిన చర్యలుంటాయని, ఆక్రమణలపై ఇక వెనక్కి తగ్గే ప్రసక్తేలదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యానించారు. కబ్జాకు బాధ్యులు ఓనర్ షిప్ చూపించుకున్న వారితో పాటు నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లు, నిర్మాణానికి రుణాలిచ్చిన బ్యాంకులను సైతం వదిలేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామ్నారు. బుద్ధభవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను, లేఅవుట్ల ఆమోదం వంటివి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని, లేని పక్షంలో కొనుగోలు చేసిన వారు నష్టపోక తప్పదని ఆయన హెచ్చరించారు. మూడు దశలుగా చెరువులు, నాలాలపై వచ్చిన కబ్జాలపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి రోజూ 30 నుంచి 40 వరకు ఫిర్యాదులొచ్చాయని, ఇప్పటి వరకు వందల సంఖ్యలో తాము ఫిర్యాదులను స్వీకరించామని, వాటిని అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే కూల్చివేతలకు వెళుతున్నట్లు ఆయన వివరించారు. ఆక్రమణలపై ఫిర్యాదులు చేసేందుకు ప్రజలు చాలా ధైర్యంగా ముందుకొస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేకంగా చెరువులు, నాలాల కబ్జాలపై పని చేసేందుకు బుద్ధభవన్ లో ఓ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఏసీపీ స్థాయి అధికారిని అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన వెల్లడించారు. 2500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న హైడ్రా పరిధిలోని జీహెచ్ఎంసీలో మొత్తం 185 చెరువులుండగా, చుట్టుపక్కల మరో 200 పై చిలుకుతో కలిపి మొత్తం 400 చెరువులున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి తోడు ప్రస్తుతం 3500 వరకున్న హైడ్రా సిబ్బందిని రెండింతలు, ఏడు వేలకు పెంచుకోనున్నట్లు, ముమ్ముందు అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను వీలైనంత త్వరగా నేలమట్టం చేసేలా యంత్రాలను సమకూర్చుకోనున్నట్లు ఆయన తెలిపారు.


**45 ఏళ్లలో 61 శాతం కబ్జా..**

గ్రేటర్ హైదరాబాద్ చెరువులు గడిచిన 45 ఏళ్లలో 61 శాతం కబ్జాకు గురైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ప్రతినిధి ప్రకాశ్ చౌహాన్ వెల్లడించిన విషయాన్ని కమిషనర్ గుర్తు చేశారు. మిగిలిన 31 శాతం చెరువులను కూడా కాపాడుకోకుంటే హైదరాబాద్ నగరానికి వరదల నుంచి భారీ ముప్పు పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్టడీ చేసిన చెరువుల్లో హుస్సేన్ సాగర్ 21 శాతం, సరూర్ నగర్ చెరువు 56 శాతం, రామంతాపూర్ చెరువు 61 శాతం, తుమ్మలకుంట చెరువు వంద శాతం కబ్జా అయినట్లు గుర్తించినట్లు రంగనాథ్ తెలిపారు. వీటితో పాటు కంట్లూర్ చెరువు 90 శాతం, పెద్ద చెరువు 60 శాతం, పల్లె చెరువు 81 శాతం, గుండ్లపోచంపల్లి చెరువు 88 శాతం, దమ్మాయిగూడ చెరువు 64 శాతం, జిల్లెలగూడ చెరువు శాతం, బాలాపూర్ చెరువు 73 శాతం కబ్జాల పాలైనట్లు గుర్తించినట్లు ఆయన వివరించారు. ఈ చెరువులన్నింటికి కబ్జాల నుంచి విముక్తి కల్గించి కాకతీయుల కాలం నాడున్న గొలుసు కట్టు చెరువులుగా పూర్వ వైభవాన్ని తేవాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

## ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పెండింగులో ఉన్న సమస్యలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, పెన్షనర్ల సంఘాల ఐకాస ఏర్పాటైంది. తమ సమస్యల పరిష్కారం కోసం నాంపల్లి టీఎన్జీవో భవన్లో వీరంతా సోమవారం సమావేశమై.. 15మందితో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. గత భీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ అని చెప్పి.. 1వ తేదీన జీతం ఇవ్వలేదని టీఎన్జీవో సంఘం నేతలు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకటో తేదీన వేతనం ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రావడం లేదని.. డీఏలు, పీఆర్సీ ఇస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 317 జీవో తెచ్చి గత ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేసిందని.. ఆ జీవోను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ నాలుగు రాష్ట్రాల్లో రద్దయిందని.. ఇందులో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సైతం ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగులే కారణమని సీఎం రేవంత్ అన్నారని.. ఆ దిశగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పని చేస్తున్నామని తెలిపారు. గచ్చిబౌలి, భాగ్యనగర్ సోసైటీ స్థలాల సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు పూర్తయ్యాక ఉద్యోగులను సొంత ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని.. త్వరలోనే మరోసారి ఐకాస సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## సీఎం చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం భేటీ



**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించింది. గత రెండు రోజులుగా అమరావతిలో పర్యటిస్తున్న ఈ బృందం.. రాజధాని ప్రాంతంలోని భవనాలు, రహదారులను పరిశీలించింది. ప్రపంచంలోని ఉత్తమ ప్రమాణాలు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి అమరావతి నిర్మిస్తున్నామని ఆ బృందానికి సీఎం వివరించారు.సీఎంతో సమావేశమైన వారిలో వరల్డ్ బ్యాంకు ఇన్ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ స్పెషలిస్ట్ రఘు కేశవన్, లీడ్ ట్రాన్స్పోర్ట్ స్పెషలిస్టు గెరాల్డ్ పాల్అలీవియర్, సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ కింగ్ యున్ షెన్,సౌత్ ఆసియా అర్బన్ ప్రాక్టీస్ మేనేజర్ అబేదాలి రజాక్ ఎఫ్. ఖలీల్ ఉన్నారు. వారితో పాటు ఈభేటీలో మంత్రి పి.నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు.

## వినేష్ ఫొగాట్‌దే తప్పు..



**ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్‌లో 50 కేజీల కేటగిరీలో ఫైనల్‌కు చేరుకున్న భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన విషయం తెలిసిందే. తన అనర్హతను సవాల్ చేస్తూ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్)ను ఆశ్రయించిన వినేశ్.. రజతం ఇవ్వాలని అభ్యర్థించింది. వినేశ్ అప్పీలుపై విచారణ చేపట్టిన సోలో ఆర్బిట్రేటర్ డాక్టర్ అన్నాబెల్లె బెన్నెట్(ఆస్ట్రేలియా) తీర్పును ఈ నెల 13కు వాయిదా వేసింది. వినేశ్‌కు అనుకూలంగా తీర్పు వస్తుందని భారత ఒలింపిక్ సంఘం ఆశిస్తున్నది. కాస్ ఏం నిర్ణయం తీసుకున్నా దాన్ని అమలు చేస్తామని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ప్రకటించింది. ఇదిలా ఉంటే బరువు పెరగడంలో వినేశ్ ఫొగట్‌దే తప్పని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్‌పర్సన్ పీటీ ఉష తేల్చేశారు. వినేష్ ఫోగట్ బరువు పెరగకుండా చూసుకోలేదని.. భారత ఒలింపిక్ సంఘం, మెడికల్ టీమ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందించిన పీటీ ఉష బరువు పెరగడంలో వినేష్ ఫోగట్‌తో పాటు ఆమె వ్యక్తిగత కోచ్‌లు, సహాయక సిబ్బందిదే తప్పు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. వినేష్ ఫోగట్ బరువు పెరగడంలో మెడికల్ టీమ్ తప్పిదం ఎంత మాత్రం లేదని పీటీ ఉష స్పష్టం చేశారు. మెడిలక్ టీమ్.. అథ్లెట్లు గాయపడితే.. వారు త్వరగా కోలుకునేలా అవసరమైన వైద్య సాయం అందించడం, గాయంపై అవగాహన కల్పిస్తారు తప్పా.. వారి బరువు, డైట్, ట్రైనింగ్‌ను పర్యవేక్షిందంటూ ఆమె క్లారిటీ ఇచ్చారు. కోచ్‌లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా ఉంటాయని, బరువు, ఫిట్‌నెస్, డైట్ విషయంలో వారిదే పూర్తి బాధ్యత అని , ఇప్పుడుతప్పు మరొకరి మీద నెట్టి వేయడం సమంజసం కాదని పీటీ ఉష తెలిపారు. అయితే కేవలం 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంతో వినేష్ ఫోగట్‌ను డిస్క్వాలిఫై చేయడంతో ఆమె ఏ పతకం పొందకుండా అయింది. రజత పతకం ఇవ్వాలని వినేశ్ చేసిన అప్పీలుపై తుది తీర్పు ఈ నెల 13న రానుంది.

# కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారని మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. “8 నెలల్లో సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా? కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా ప్రవర్తిస్తున్నారు. వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఈ ప్రభుత్వంలో మంత్రులు సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం సన్నాహక సమావేశాల పేరు మీద నెత్తిమీద నీళ్లు చల్లుకుంటూ పోటీలు పడుతున్నారు. ఒక మంత్రి మొదటి పంపు హౌజ్ బటన్ నొక్కి నీళ్లు నెత్తిమీద చల్లుకొని భూమికి దండం పెట్టిండు. వెంటనే ఇంకో మంత్రి వెళ్లి తన కంటే ముందు క్రెడిట్ కొట్టేయాలని ట్రాక్టర్ నడుపుతూ వెళ్లి ఇది నేనే చేస్తున్నట్టు నటించారు. నేను కదా నీటి పారుదల మంత్రిని అని చెప్పి.. ఆయన కూడా నిన్న వెళ్లి కట్కా ఒత్తి ఇది నా సొంతమని చెప్పకనే చెప్పారు. ఈ ముగ్గురు మంత్రులు క్రెడిట్‌కు పోయారు. ఇక 15న ముఖ్యమంత్రి వెళ్తారట అని హరీశ్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీపడి పర్యటనలు చేస్తున్నారు. మేము ఇచ్చిన ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకొంటున్నారు. మేము చేసిన ప్రతి మంచి పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పుకొంటున్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరేవారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఉండేదా? కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కానీ, కేసీఆర్ ఈ జిల్లాలో రెండు పంటలు పండే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు. 8 ప్యాకేజీల్లో 5 భారాస ప్రభుత్వం చేసిందే. మరో 3 ప్యాకేజీల్లో 80 శాతం పనులు మేమే పూర్తి చేశాం" అని హరీశ్రావు తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతుంది..**

రాష్ట్రంలో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని.. కేసీఆర్ తన ఇష్టమైన ప్రాజెక్టుగా రూపొందించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుపై క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతుంది. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన కృషి, సాధించిన గొప్ప విజయాలను తమ విజయాలుగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఫీట్లు పడుతుంది. ఖమ్మం జిల్లా కరువు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ సంకల్పించారు. పవిత్రమైన ఈ ప్రాజెక్టుకు సాక్షాత్తు సీతారామచంద్రుల పేరే ఉండాలని వారి పేరు నామకరణం చేసి శరవేగంగా పూర్తి చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.




**కాంగ్రెసోళ్లను చూస్తుంటే పక్కా పరాన్నజీవులు అనిపిస్తుంది**

సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో అనేక కేసులు వేసి అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటూ వేగంగా నిర్మించే ప్రయత్నం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రభుత్వం మారడంతో ఆ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం కాంగ్రెస్ సర్కార్‌కు దక్కింది. రిబ్బన్ కంటిగ్ అవకాశం వచ్చిందని చెప్పి ప్రాజెక్టే తాము కట్టినట్టు కటింగ్ ఇస్తే ప్రజలు నవ్వుకుంటారు. ఇతరుల ఘనత తమ ఘనతగా చెప్పుకునే వారిని పరన్నాజీవులు అంటారు. ఇవాళ కాంగ్రెసోళ్లను చూస్తుంటే పక్కా పరాన్నజీవులు అనిపిస్తుంది. ఒక ప్రాజెక్టు కట్టాలంటే సర్వే, డీపీఆర్, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, నిధులు సమకూర్చాలి.. ఇలా ఎన్నో దశలు పూర్తి కావాలి. ఇవన్నీ పూర్తి కావాలంటే కనీసం కొన్ని సంవత్సరాలు పడుతుంది. మరి ఏడెనిమిది నెలల్లోనే ఇన్ని దశలు దాటి మీరు కట్టేశారా..? డీపీఆర్, సర్వేలు, టెండర్లు, భూసేకరణ, పంపులు, మోటార్లు బిగించి ప్రారంభిస్తున్నారా..? మిమ్మల్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

**నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్ మంత్రులకు లేదు..**

30 వేల ఉద్యోగాల కథ ఎట్ల ఉన్నదో సీతారామ ప్రాజెక్టు కథ కూడా అట్లనే ఉన్నది. బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఫిజికల్, మెడికల్ టెస్టులు చేసి ఫలితాలు విడుదల చేశాం. ఎన్నికల కోడ్, కోర్టు కేసులు, సాంకేతిక కారణాల వల్ల అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆగిపోయాయి. కానీ ఇవాళ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఇస్తే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. అయితే సీతారామ ప్రాజెక్టు 90 శాతం బీఆర్ఎస్ చేసిందని నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్ మంత్రులకు లేదు. కానీ ఆ ధైర్యం కేసీఆర్‌కు ఉండే. నిండు శాసనసభలో సీఎం హోదాలో కేసీఆర్ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్‌లు.. రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన వీటన్నింటిని యథావిధిగా కొనసాగిస్తామని ధైర్యంగా చెప్పిండు. సంస్కారం ఉన్న నాయకుడు కాబట్టి కేసీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ మీ సంస్కారం ఏంటి.. పాఠ్య పుస్తకాల్లో కేసీఆర్ పేరు, ఫొటో ఉన్నదని చెప్పి పేపర్లు చింపి తమ పేర్లను అతికించుకున్న చరిత్ర రేవంత్ రెడ్డిది. తమ హయాంలో పూర్తి చేసిన ఫ్లై ఓవర్లను, ప్రాజెక్టులను మాత్రమే ప్రారంభిస్తున్నారు. తమ హయాంలో ఆర్డర్లు ఇచ్చిన బస్సులకు జెండాలు ఊపుతున్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ నేతలు కాలం గడుపుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



బీఆర్ అరుణ్ అంబేత్కర్ జన్మదిన వేడుకలు సోమవారం చైతన్యపురిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వంభర పత్రిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాము మహేందర్ యాదవ్, విజయ్ కుమార్, కోడూరు శ్రీనివాస్, శ్రీధర్ మాదిగ, నరేష్, ఇందుర్తి వెంకట్ రెడ్డి, నాగార్జున రెడ్డి, అశోక్ రెడ్డి, జయాపాల్ రెడ్డి, సంపత్, జనార్ధన్ గౌడ్, రమేష్ మాదిగ, విష్ణు వడ్డెర తదితరులు పాల్గొన్నారు.

– విశ్వంభర, హైదరాబాద్






తెలంగాణ వైశ్య గ్రాడ్యుయేట్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి విజయ్ తల్లి కర్నాటి భాగ్యమ్మ ప్రథమ సంవత్సరీకం కార్యక్రమానికి వైశ్య వికాస వేదిక చైర్మన్, వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ హాజరై కర్నాటి భాగ్యమ్మ పూల మాలవేసి నివాళులర్పించారు.

– విశ్వంభర, వనస్థలిపురం

# రెండేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులను పూర్తి చేస్తాం



## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ రక్కసిని కట్టడి చేయడంతోపాటు జిల్లాలో కరువుతో వ్యవసాయానికి దూరమైన 4 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన ఎస్-ఎల్ బీసీ టన్నెల్ పనులను రాబోయే రెండేళ్లలో పూర్తిచేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒహయోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈఓ లాక్ హెూం తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా టన్నెల్ తవ్వకానికి ఉపయోగించే అధునాతన నిర్మాణ మెషినరీని సీఈఓ లాక్ హెూం మంత్రికి చూపించి వాటి పనితీరు గురించి వివరించారు. అనంతరం లాక్ హెూం తో సమావేశమైన మంత్రి.. టన్నెల్ తవ్వకానికి ఇబ్బందిగా మారిన బేరింగ్ తో పాటు ఇతర కటింగ్ స్పేర్ పార్టులను వీలైనంత త్వరగా సమకూర్చాలని కోరారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ పూర్తయితే 3 లక్షల ఎకరాలకు ఎలాంటి పంపింగ్ లేకుండా కేవలం గ్రావిటీ ద్వారా నీరు అందుతుందని.. ఉదయ సముద్రంలో భాగమైన బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా మరో లక్ష ఎకరాలకు పంపింగ్ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. మొత్తంగా 4 లక్షల ఎకరాల భూములకు సాగునీటి సదుపాయం కలిగించే ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పనులు.. బేరింగ్ తో పాటు ఇతర రిపేర్లతో ఆగిపోయాయని.. స్వయంగా ప్రభుత్వమే ప్రత్యేకంగా చొరవ తీసుకున్నందున బేరింగ్ తో పాటు ఇతర పరికరాలను వీలైనంత త్వరగా అందించాలని రాబిన్స్ కంపెనీ సీఈఓ లాక్ హెూమ్ ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు.. తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ద్వారా ప్రాజెక్టు పనులకు బిల్లులు చెల్లింపులు చేసేలా నిర్ణయం తీసుకున్నందున బేరింగ్ తో పాటు ఇతర స్పేర్ పార్ట్స్ ను వీలైనంత త్వరగా సమకూరిస్తే.. తక్షణం చెల్లింపులు చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని ఆయన వివరించారు. గ్రీన్ ఛానెల్ అమల్లో ఉన్నందున పనులు జరిగిన 40 రోజుల్లనే చెల్లింపులు చేసే విధానం గురించి రాబిన్స్ కంపెనీ సీఈఓ లాక్ హెూంకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరణతో పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన లాక్ హెూం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణంలో ప్రధాన బేరింగ్ తో పాటు ఇతర కటింగ్ స్పేర్ పార్ట్స్ ను అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో 7 డయామీటర్లు కలిగిన బేరింగ్ తో పాటు ఇతర స్పేర్ పార్ట్స్ ను షిప్ ద్వారా చెన్నైకి చేర్చుతామని అక్కడి నుంచి పనులు జరుగుతున్న ప్రాంతానికి పంపిస్తామని చెప్పారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టును బ్లాస్టింగ్ ప్రక్రియలో పూర్తి చేసే అవకాశం ఏమాత్రం లేకపోవడం.. కేవలం టన్నెల్ బోరింగ్ ద్వారా మాత్రమే చేసే పరిస్థితులు ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి రాబిన్స్ కంపెనీతో చర్చలు జరిపి పనులను ముందుకు తీసుకెళ్తుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు రాబిన్స్ కంపెనీ సీఈఓ లాక్ హెూమ్, సాగునీటి పారుదల శాఖ నల్గొండ సీఈ వి. అజయ్ కుమార్ , జైప్రకాశ్ అసోసియేట్ కంపెనీ డైరెక్టర్ పంకజ్ గౌర్ , రాబిన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ

**విశ్వంభర, వనస్థలిపురం :** సూర్య నగర్ కాలనీ ఇంజాపూర్‌లో సోమవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉంది ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖః సంతోషలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్, అల్లం రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.









# అందమైన జీవితం... అందరికీ కావాలి సొంతం



## ఇదే లైఫ్-హెల్త్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ లక్ష్యం.. నేడు హైదరాబాద్‌లో రజతోత్సవం

అందరూ బాగుండాలి. అంతా ఆనందంగా ఉండాలి. ఈ జీవితానికి ఓ అర్థం ..పరమార్థం ఉండాలి.. స్వార్థాన్ని వీడి సమాజానికి మనవంతు సాయపడాలి. ఇలాంటి మాటలను చాలా మంది చెప్తారు. కానీ ఈ అన్నింటినీ ఆచరించి చూపే వాళ్లు అత్యంత అరుదుగా ఉంటారు. అలాంటి కోవకే చెందిన వారు డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్, డాక్టర్ వేంకట కామేశ్వరి దంపతులు. వైద్యులుగా సుప్రసిద్ధులైనా వ్యాపార ధోరణులకు పోకుండా పేదలకు వైద్యసేవ చేస్తూ సమాజానికి కూడా ఎంతో సమయమిస్తున్నారు. లైఫ్-హెల్త్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పాతికేళ్లుగా ఎన్నెన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఈ జీవితానికి లక్ష్యమేంటి? అనే ప్రశ్నను ఇరవై ఐదేళ్ల క్రితం వేసుకుని వారు తమ సేవా ప్రస్థానాన్ని ప్రారంభించారు. అందమైన జీవితాన్ని అనుభవించడానికే అందరం జీవించాలి అనే భావనను సమాధానంగా తెలుపుతున్నారు. తమ అనుభవాలను అందరికీ పంచుతూ స్ఫూర్తి నింపుతున్నారు.

**అరటిపండ్లు..తోపుడు బండ్లు**

ఇది ఒక గొప్ప ఆలోచన. అత్యంత కష్టమైన వైద్య విద్యను పూర్తి చేసి , డాక్టర్లుగా స్థిరపడిన ఎవరైనా అరటిపండ్ల తోపుడు బండ్లను ఏర్పాటు చేస్తారా? డాక్టర్లయి ఉండి ఇదేం పని అందరూ హేళన చేయరా? అయినా సరే అందుకు సిద్ధపడ్డారు వైద్య దంపతులు డాక్టర్ సూర్యప్రకాశ్, డాక్టర్ వేంకట కామేశ్వరిలు. 2001లో వారు ఒక తోపుడు బండిని ఏర్పాటు చేశారు. అందరికీ ఆహారం అందాలి. ఎవరూ ఆకలితో ఉండొద్దు అనే భావన పెంచడానికి దీనిని ప్రారంభించారు. ఒక అరటిపండు తినండి.. మరొకటి వేరేవారికి ఇవ్వండి అనేదే ఈ బండి నినాదం. 2003 వరకు ఇలాంటి తొమ్మిది తోపుడు బండ్లను ప్రారంభించి వేలమందికి అవగాహన కల్పించారు.

**గర్భాశయాల అనవసర తొలగింపుపై ఉద్యమం**

వివిధ సేవాకార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఎంతోమంది మహిళలకు చిన్నవయసులోనే గర్భసంచి తొలగించిన విషయం వైద్య దంపతుల దృష్టికి వచ్చింది. అనంతరం ఈ విషయంలో భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగానికి వీరు నివేదిక ఇచ్చారు. 2008 నుంచి 2011 వరకు మెదక్ జిల్లా మునిపల్లి మండలంలో గర్భాశయ సమస్యలపై పరిశోధన చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 2012లో ఉమెన్ స్ప్రెడింగ్ లైట్ పేరిట 270 రోజుల కార్యక్రమంలో స్త్రీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భాశయాలను తొలగించడం, గృహ హింస, బాలికలకు విద్య, వరకట్నం, భ్రూణ హత్యలపై సమాజంలో విస్తృతంగా చర్చ జరిగేలా కార్యక్రమాలు చేపట్టారు. గర్భసంచిని కాపాడుకుందాం-సమాజాన్ని బలపరుచుకుందాం, మధుమాలతి అనే పుస్తకాలను కూడా వెలువరించారు. ఈ అంశంలో ఇప్పటికీ తమ కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు.




**అందమైన జీవితానికి ఏడు అడుగులు**

ఆహారం: - 1) తెలుసుకో పెంచు పంచు
విద్య :- 2) చదవండి 3) రాయండి
భాద్యత:- 4) వృత్తిని రక్షించుకోవడం 5) ప్రచారం
పై అన్నింటికి మూలం :- 6) ప్రేమ 7) నిజాయితీ

**7 STEPS TO LEAD AND SUSTAIN BEAUTIFUL LIFE**

Food :- 1) Know Grow Share
Knowledge :- 2) Read 3) Write
Responsibility:- 4) Protect 5) Promote
Nucleus :- 6) Love 7) Honesty

**గ్రంథాలయాలతో జ్ఞానవ్యాప్తి**

లైఫ్-హెల్త్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించినప్పటి నుంచీ వివిధ సందర్భాలలో వేలాది పుస్తకాలను పంపిణీచేశారు. 2011 జూలై 18 నుండి అక్టోబర్ 25 వరకు 100 పుస్తకాలు, 100 రచయితలు , 100 రోజులు అనే కార్యక్రమం ద్వారా పుస్తక పఠనం ఒక అభిరుచి గా సమాజంలోకి తీసుకువెళ్లారు. 2020 ఆగస్టులో 12న వంద చిన్న గ్రంథాలయాలను ఏర్పటు చేశారు. హైదరాబాద్ లో 75. తెలుగు రాష్ట్రాలలో 16, తమిళనాడు 3. బెంగుళూరులో 6, కేరళలో 1 చొప్పున వివిధ రకాల పుస్తకాలతో వీటిని ప్రారంభించారు. 2022 నవంబరు 14 న చింతల్ లో సూర్యప్రకాష్ ఆనందనిలయం లో కేంద్రీయ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. రజతోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు రెండో వారంలో ఆరువేల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. హైదరాబాద్‌లోని పలుప్రాంతాలలో పాఠశాల విద్యార్థులు మొదలుకొని డిగ్రీ విద్యార్థుల వరకు వీటిని పంపిణీచేశారు.

**ఇంకా ఎన్నో..ఎన్నెన్నో!**

ఆర్ట్ ఆఫ్ లెటర్ రైటింగ్ అనే కార్యక్రమం కింద ఉత్తరాలు రాయడం వల్ల పరస్పర మానవసంబంధాలు ఎలా బలపడుతాయో తెలియజెప్పారు. "స్ప్రెడింగ్ లైట్" అనే కార్యక్రమం ద్వారా సమాజం పట్ల పౌరుల బాధ్యతను ప్రజల్లోకి తీసుకువెళ్లారు.. 2013 లో ట్రీ హౌస్ (వృక్ష నివాసం) పేరిట సంఘం పట్ల పౌరుల బాధ్యతను గుర్తుచేశారు. 2016 భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరూ బాగుండాలి - మనవంతున అనే కార్యక్రమం చేపట్టారు. ఆత్మహత్యలు , మరణాలు అనే అంశంపై 71 రోజుల అవగాహన కార్యక్రమం చేపట్టారు. 72 రోజులపాటు భారతీయ ఆయుర్వేదం పై వివిధ ప్రాంతాల ఆయుర్వేద వైద్యులచే కార్యక్రమాలు నిర్వహించారు. కొవిడ్ సమయంలో వైరస్ బారిన పడిన అనేక మందికి చికిత్సలు అందించారు.

**రజతోత్సవంలోనూ సామాజిక బాధ్యత**

లైఫ్-హెల్త్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్ దోమల్ గూడలోని ఏవీ కాలేజి ఆడిటోరియంలో రజతోత్సవం నిర్వహిస్తున్నారు. ఈసందర్భాన్నికూడా సమాజానికి ఉపయోగపడేలా రూపకల్పన చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు యువసమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. యువతకు ఎంతగానో ఉపయుక్తంగా ఉండేలా స్వయం ఉపాధి అవకాశాలు, విద్య, పర్యావరణం, వ్యవసాయం తదితర అంశాలపై నిపుణులతో ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి పెద్దలతో చర్చా కార్యక్రమాలు ఉంటాయి. వివిధ రంగాల్లో సుప్రసిద్ధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు.

### పాతికేళ్ల సేవా ప్రస్థానం

లైఫ్-హెల్త్ రీయిన్‌ఫోర్స్‌మెంట్ స్వచ్ఛంద సంస్థను 1999లో ప్రారంభించారు. ఆ సంవత్సరం ఆగస్టు 13న తెలంగాణ సొసైటీల విభాగంలో రిజిస్టరైన ఈ సంస్థ మంగళవారం రజతోత్సవాలను నిర్వహించుకుంటోంది. ఆరోగ్యం పట్ల అవగాహన, చదువు పట్ల అభిరుచి, ఆహారం విషయంలో బాధ్యత, ఇతరుల ఆకలి తీర్చాలనే భావన, దేశం పట్ల ప్రేమ, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రేమగా, నిజాయతీగా ఉండటం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు, పూల మొక్కల పంపిణీ, సామాజిక సమస్యలపై స్పందన, వైద్యంలో వ్యాపార ధోరణులపై పోరాటం, మహిళలకు అనవసరంగా గర్భసంచులు తొలగించడంపై ఉద్యమం, గ్రంథాలయాల ఏర్పాటు, పుస్తకాల ప్రచురణ, ఉచితంగా పుస్తకాల పంపిణీ ద్వారా జ్ఞాన వ్యాప్తి, ఇలా ఎన్నో..ఎన్నెన్నో అంశాలపై ఈ సంస్థ ఇరవై అయిదేళ్లుగా కృషి చేస్తోంది. ప్రారంభమైన నాటి నుంచి కొన్ని వందల కార్యక్రమాలను నిర్వహిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్, డాక్టర్ వేంకట కామేశ్వరిలు తమ వ్యక్తిగత జీవితంలో వచ్చిన ఒడుదొడుకులను తట్టుకుంటూ..తమ కుటుంబాన్ని సంరక్షించుకున్నట్లే సమాజాన్ని కూడా అక్కున చేర్చుకుని సొంత సంపాదనతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థగా అవకాశమున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కానీ, ఇతర సంస్థల నుంచి కానీ నిధులను ఆశించకుండా.. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా అందరూ బాగుండాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. తమ ఆలోచనలు అర్థం చేసుకుని స్వచ్ఛందంగా ఎవరైనా తోడు నడిస్తే వారి సహాయ సహకారాలను తీసుకుంటున్నారు. ఈ ప్రస్థానంలో జీవితాన్ని అందంగా, ఆనందంగా ఎలా గడపాలో.. ఎలా జీవించాలో అనుభవపూర్వకంగా తెలుసుకుని ఆ అనుభవాలను అందరితో పంచుకోవడానికి రజతోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉన్నతమైన విలువలతో కూడిన సమాజాన్ని భావితరానికి అందిద్దామంటూ అందరినీ ఆహ్వానిస్తున్నారు.

### అందరి ఇల్లు..

ఇదొక వినూత్న ప్రయత్నం. తమ ఇంటిని అచ్చంగా ప్రజలకు అప్పగించడం. ఇక్కడికి ఎవరైనా రావొచ్చు. వండుకుని తినొచ్చు. చదువుకోవచ్చు..2006 జూన్ 15న ఇది ప్రారంభమైంది. మొదట్లో రాత్రి పదకొండు గంటల నుంచి ఒంటిగంటి వరకు తెరిచి ఉంచి అందరికీ ఆహారం అందించేవారు. క్రమంగా ఉదయం 5 గంటల నుండి రాత్రి ఒంటిగంట వరకు అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ కొత్తపేటలో ఉన్న ఈ అందరి ఇల్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు చదువుకునేందుకు కొన్ని పుస్తకాలు కూడా ఇక్కడ అందుబాట్లో ఉంటాయి. సమాజం పూర్తిగా వ్యాపారమయమైన ఈ రోజుల్లో హైదరాబాద్ లాంటి మహానగరంలో తమ ఇంటిని పూర్తిగా ఇతరులకు కేటాయించడాన్నిబట్టి వైద్య దంపతుల నిస్వార్థ సేవను అర్థం చేసుకోవచ్చు. 2022లో వైజాగ్ మద్దిలపాలెంలో కూడా అందరి ఇల్లు ప్రారంభమైంది.





- రావికంటి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, 9908892067

# సేవాభావానికి ప్రతిరూపం నైటింగేల్

> **అవివాహితలు ఇంటి పనులు, చర్చి పనులే చేయాలనీ ఆంక్షలు ఉన్న రోజులవి. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఆమె ఛేదించింది. ఆ రోజుల్లోనే ఒక విధంగా సంఘం మీద తిరగబడింది. పేదలకు, అనాథలకు సేవ చేయాలన్న అభిలాషతో, ఇంటా, బయటా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, లక్ష్య సాధనలో మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించింది. రోగుల పాలిటి దేవతగా వెలుగొందింది. ఆమే విశ్వ విఖ్యాత ఫ్లోరెన్స్ నైటింగేల్. నైటింగేల్ ఎంతో గొప్పింటి అమ్మాయి అయినా నర్సుగా సేవలు అందించడానికే నిశ్చయించుకుంది.**



ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820, మే 12న ఇటలీలో జన్మించింది. 1853న లండన్ లోని ఓ స్త్రీల ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకొని వెళ్ళింది."ది లేడీ విత్ ది లాంప్" గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక బ్రిటిష్ నర్సు, సామాజిక సంస్కర్తగా, గణాంక నిపుణురాలిగా, ఆధునిక నర్సింగ్ స్థాపకురాలుగా ప్రసిద్ధి గాంచింది. వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకొంటారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవం నాడు గుర్తు చేసుకుంటారు.

ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత, ఏమాత్రం ఉండేవికావు. అయినాకూడా ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ పని చేయడానికే నిర్ణయించుకుంది. తన తల్లి సాహితీ ప్రపంచంలో ధ్రువతారగా వెలగాలని కోరినా, ఫ్లోరెన్స్ నైటింగేల్, జర్మనీలో కైసర్ సంస్థను గూర్చి విని, అక్కడే పని చేయాలనీ నిర్ణయించుకుంది. ఇద్దరు బిడ్డల్ని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది.1852 లో ఐర్లాండ్ వెళ్ళింది. అక్కడి ఆసుపత్రులను చూడగానే వాటిల్లో విప్లవాత్మకమైన మార్పులను తేవాలి అనుకున్నది. 1853 లో సిస్టర్స్ ఆఫ్ ఛారిటీకి వెళ్ళింది. తిరిగి లండన్ వచ్చి, తన నాయనమ్మకు సేవ చేయడానికి రాగా అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి రోగులకు, పగలు, రాత్రి అనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగులకు మంచి ఆహారం అందించింది. 1854-56 లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లారెన్స్ వచ్చి తోటి నర్సులను కూడగట్టుకొని యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరుపమాన సేవలందించింది. ధైర్యం చెప్పింది. సాటి నర్సులు విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబం లోనుంచి వచ్చిన ఆమె ఏరి కోరి పనిని ఎంతో శ్రద్ధతో, ఇష్టంతో చేసేది. గుండె నిబ్బరంతో, చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. అందుకే ఆమె లేడీ విత్ ది లాంప్ గా వాసికెక్కింది.

మొదట్లో ఆమెను చూసి అధికారులు జ్వలించి పోయేవారు. తరువాత ఆమె నిరుపమాన సేవకు ముగ్ధులయ్యారు. వారికి రోజూ, రోగులకు కావాల్సిన మందులు పరికరాలను పంపమని అభ్యర్ధనలు పంపి, పలుమార్లు స్వంత డబ్బు ఖర్చు పెట్టి అన్ని తెప్పించేది. ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్ళను, భవంతులను ఆసుపత్రులుగా మార్చేది. రాత్రులలో రెండు, మూడు గంటలే పడుకుని అహర్నిశలు పని చేసేసరికి ఆమె చిక్కి పోయింది. అయినా రోగులకు ఆమె ఆరాధ్య దైవం. ఆమె నడచిన దారి అతి పవిత్రం. వారు విక్టోరియా రాణి మరణిస్తే ఫ్లారెన్స్ ను రాణి చేస్తామని" అనేవారట. ఆమె ఎక్కడికి వెళ్ళినా సైనికులు అడవి పూలతో పుష్పగుచ్ఛాల నిచ్చేవారట. అది చూసి తోటి డాక్టర్లు, నర్సులు అసూయ చెందేవారట. అయినా ఆమె తన సేవలను మానకుండా చేస్తూండగా ఒకనాడు స్పృహ తప్పి పడిపోయింది. సైనికులకు వచ్చిన జ్వరమే ఆమెకు వచ్చింది. కాసిల్ ఆసుపత్రిలో ఆమెను రోగిగా చేర్చుకున్నారు. ఆమెను చూసి మిగతా రోగులు కన్నీరు కార్చారు. అయినా ఆరోగ్యం మెరుగు పడగానే, తిరిగి క్రిమియా, స్కుటారి ఆసుపత్రుల మధ్య తిరుగుతూ రోగులకు సేవలందించింది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్, అనే గ్రంథాలను రాయడమే కాకుండా, విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్ధనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణను ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24 న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సేస్ అనే సంస్థను లండన్ లో స్థాపించారు. ఆమెను' మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్' గా గుర్తించారు.


భారత దేశానికి కూడా ఆమె ఇతోధిక సేవలనందించింది. 1859 లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమిషన్ ను నియమించింది. చెన్నై నగరపు మేయర్ ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు.

1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టిన రోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. నర్సులు దినోత్సవం రోజున, నర్సింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా విశేష సేవలందించిన నర్సులకు భారత రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందిస్తారు.1910 ఆగస్ట్ 13 లో ఫ్లారెన్స్ మరణించినా, సేవా నిరతిగల ప్రతి నర్సు లోను ఆమె కలకాలం జీవించి ఉంటుంది.

1973లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఈ అవార్డులో భాగంగా కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత, స్వచ్ఛంద సంస్థల్లో విశిష్ట సేవలందించిన నర్సులకు ఒక పతకం, ప్రశంసాపతరం, జ్ఞాపికతో పాటు 50వేల రూపాయిల నగదు బహుమతిని బహుకరిస్తారు.

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చేరిన వారికి సేవలు చేసే చేతులు ఏవైనా ఉంటె అవి సేవామయులైన నర్సుల చేతులే. మానవ సేవే మాధవ సేవ అని తలంచి, మానవ సేవ ద్వారానే తమ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న వారు నర్సులు. అలాంటి నర్సులకే ఆదర్శప్రాయమైన నైటింగేల్ దన్యురాలు.కరోనా బారిన పడిన బాధితులను కాపాడటానికి ఫ్లోరెన్స్ నైటింగేల్ లు ప్రతి రూపాలుగా వారు చేస్తున్న సేవలు అపూర్వం, అసామాన్యం, అనిర్వచనీయం, అభినందనీయం. కరోనా బాధితులకు నిత్యం సేవలు చేస్తున్న వైద్య సిబ్బందిలో, తమ ప్రాణాలను పణంగా పెట్టి, ప్రధాన పాత్రలు పోషిస్తున్న నర్సుల సేవలను ఎలా మరిచిపోగలం, వారి రుణం ఎలా తీర్చుకోగలం?





-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



# ఘనంగా తీజ్ పండుగ వేడుకలు

**విశ్వంభర, సిరోల్:** గిరిజనుల ఆరాధ్య దైవం తిజ్ పండుగ ఉత్సవాలను మహబూబాద్ జిల్లా సిరోల్ మండలం వస్త్రం తండాలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గిరిజన యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ణావత్ గాంధీ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా ప్రజలందరికీ, గిరిజన మహిళలకు యువతి యువకులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తీజ్ పండుగ బతుకమ్మ పోలి ఉంటుందని తీజ్ పండుగను 8 రోజుల పాటు పూజించి, 9వ రోజు నిమజ్జనం చేస్తారన్నారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో తీజ్ సంబరాలు జరుపుకుంటారని తీజ్ పండుగను పెండ్లి కాని అమ్మాయిలు తొమ్మిది రోజుల పాటు నవధాన్యాల మొలకలను పూజలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని గాంధీ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో వస్త్రం తండా నాయకులు బానోత్ వీరన్న నాయక్, మాజీ ఎంపీటీసీ వీరు నాయక్, బానోత్ లక్ పతి నాయక్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్ వీరన్న, శ్రీనివాస్ నాయక్ ,దేవేందట్ నాయక్, భూక్యా రవి నాయక్, ఏజెంట్ మంజుల భేటీ, బిచ్య నాయక్ పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ ఆఫీస్ ముందు పీవైఎల్ ధర్నా




**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాదులో పారిశుధ్య లోపం మూలంగా డెంగు, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ తో ప్రజలు అల్లాడిపోతున్నారని, అయినా జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీ.వై.ఎల్) గ్రేట్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో చలో జీ.హెచ్.ఎం.సీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో పీ.వై.ఎల్ కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. గేట్లు ఎక్కి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీ.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తాయని, మరీ ముఖ్యంగా డెంగ్యూ జ్వరం విజృంభిస్తుందని తెలిసిన ప్రభుత్వము నిర్లక్ష్యం వహించింది అన్నారు. దోమల నివారణకి జీహెచ్ఎంసీ పరిధిలో 2500 మంది ఎంటమాలజీ సిబ్బంది ఉన్నా, 15 కోట్లు నిధులు కేటాయించినా, వీధులలో మొక్కుబడిగా పాగింగ్ జరుగుతుందన్నారు. డెంగ్యూ దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్ సరిగ్గా చేయకపోవడంతో, నేడు హైదరాబాదులో డెంగ్యూ కేసులు అధికం అవుతున్నాయన్నారు. పారిశుధ్యం సైతం సరిగా లేదని స్వయంగా జీహెచ్ఎంసీ కమిష నర్ ఆమ్రపాలి మాటలే తార్కాణం అన్నారు. డెంగ్యూ జ్వరాలతో చిన్న పిల్లలే ప్రధానంగా బలవుతున్నారన్నారు. దీనికి తోడు వీధి కుక్కల దాడి విపరీతంగా పెరిగిందన్నారు. వీటన్నిటిని అరికట్టే దిశలో జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జీ.వై.ఎల్ నాయకత్వం 20 బస్తీలలో సర్వే చేయగా, ఫాగింగ్ సరిగా చేయడం లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. తక్షణమే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సీజనవ్యాధులు అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని, లేని ఎడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వేల్ విజయలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి కుమార్, బి.ఎస్ కృష్ణ, ఉపాధ్యక్షులు కిరణ్, బంగారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మల్లేష్, యల్లప్ప, కోశాధికారి కొల్లూర్ భీమేష్, నాయకులు బాలు, రాజు, అజ్మీరా విజయ్, మనోహర్, రాకేష్, మహేష్, రాము, అంజి పాల్గొన్నారు.

## ఏబీవీఎం అధ్యక్షుడిగా కరణ్ సింగ్
# చవారియా నియామకం



**విశ్వంభర, కరీంనగర్:** అఖిల భారతీయ వాల్మీకి జాతీయ అధ్యక్షుడు చౌదరి సురేం దర్ కుమార్ లోహత్ సిఫార్సుపై, వ్యవస్థాప కుడు కరీంనగర్ వాల్మీకి నగర్‌కు చెందిన ఎస్.హెచ్. కరణ్ సింగ్ చవారియాను అఖిల భారతీయ వాల్మీకి మహాపంచాయి తెలంగాణ ప్రదేశ్ అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ యొక్క నియమ, నిబంధనలకు అనుగుణంగా వాల్మీకి సంఘం యొక్క ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రదేశ్ లో ఏబీవీఎం కుటుంబాన్ని విస్తరించడానికి కూడా అతను అధికారం కలిగి ఉన్నాడు అని మనీష్ లాల్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటన లో తెలియజేశారు.

# గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలం ప్రశాంతపురి తాండా శివారులో సోమవారం ఉదయం నాగార్జునసాగర్ హైదరాబాద్ హైవే వెంట ఉన్న కేతావత్ చంద్రు వ్యవసాయ వరి పొలంలో గుర్తు తెలియని యువకుడు (30) ఎలాంటి గాయాలు లేకుండా వరి పొలంలో చనిపోయాడు. మరణించిన వ్యక్తి యొక్క కుడి చేతి పైన యాదవ్ జీ అని పచ్చబొట్టు వున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంతపురి తండా గ్రామపంచాయతీ సిబ్బంది కేతావత్ లచ్చిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతపల్లి ఎస్సై బి.యాదయ్య తెలిపారు.

# చిన్నారులపై వీధి కుక్కల దాడులు బాధాకరం

- ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడం దారుణం
- వీధి కుక్కల దాడిలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి
- బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో వీధికుక్కల బెడద నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, చిన్న పిల్లలపై వీధి కుక్కల దాడులు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వం కనీస నివారణ చర్యలు చేపట్టకపోవడం దారుణమని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుంజాల వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి చెర్క సత్తయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాల్టీలో దివ్యాంగ చిన్నారిపై కుక్కల దాడి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం వంటి హృదయవిదారక ఘటనలు జరిగినా ప్రభుత్వం చలించకపోవడంఅమానవీయం అన్నారు. చిన్నారులు, వృద్ధులు బాటసారులపై కుక్కల దాడులు నిత్యకృత్యం అవుతున్నాయని, రోజు రోజుకు తీవ్రం అవుతున్నాయని వారు విమర్శించారు. కుక్కల దాడిలో మరణించిన కుటుంబాలకు స్థానిక సంస్థలు నష్టపరిహారం చెల్లించాలి అని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అదేశించినప్పటికి తగు చర్యలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ గానీ ప్రభుత్వ యంత్రాంగం గానీ మీనమేషాలు లెక్కిస్తున్నారని ఇంకెంతమంది ప్రాణాలు గాల్లో కలువాలని వారు ప్రశ్నించారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా
# ఎగురవేసి దేశభక్తిని చాటాలి



**విశ్వంభర, కల్వకుర్తి:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్వకుర్తి పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బోడ నరసింహ ఆధ్వర్యంలో తిలక్ నగర్ కాలనీలోని బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సందర్భంగా జిల్లా కన్వీనర్ నీరుకంటి రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమంలో బాలగంగాధర్ పాత్ర మరువలేనిది అన్నారు. తిలక్ వినాయక మండపాల యువకులతో కలిసి దేశ స్వతంత్ర ఉద్యమంలో తన ప్రత్యేకమైన కార్యాచరణతో ఉద్యమాన్ని దేశంలో ఉగ్రరూతలూగించడం గర్వకారణం అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు.
ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీసీ మోక్ష జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకూర రవి గౌడ్, బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్ గౌడ్, బీజేపీ నాయకులు బ్రంగి వివేకానంద, తిలక్ నగర్ కాలనీ బూత్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.



## పోలీసులు సమర్థవంతంగా
# పనిచేయాలి
### ఎస్పీ కిరణ్ ఖరే

**విశ్వంభర, భూపాలపల్లి:** పోలీసులు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా దివస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని, విధులు నిర్వహించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారి పట్ల చట్ట పరంగా కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు.



## అర్హత సాధించిన వారికి మాత్రమే
# రేషన్ షాపు కేటాయింపు

**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ కార్యవర్గ సమావేశం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ రేషన్ దుకాణం డీలర్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదనీ అన్నారు. దరఖాస్తు చేసుకుని వ్రాత పరీక్ష, మౌఖిక పరీక్షలలో అర్హత సాధించిన వారికి మాత్రమే రేషన్ షాపు కేటాయింపు ఉంటుందని అన్నారు. వేరే నియోజకవర్గాలలో కేటాయింపు ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలియదు, కానీ కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని 25 రేషన్ దుఖానాలకు గాను ఒక్క రేషన్ షాపు, డీలర్ నియామకంలో కూడా అవకతవక జరగదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి మున్సిపాలిటీ బీజేపీ కైవసం అవుతుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు.

# పారిపోయిన విద్యార్థులను కాపాడిన పోలీసులు

**విశ్వంభర, మాడుగుల:** మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లిలోని సెయింట్ గ్రైతాన్స్ స్కూల్ కు హాస్టల్ నుండి ఇద్దరు విద్యార్థులు ఆకాష్, రాజవీర్ లు శని, ఆది వారాలు రెండు రోజులు సెలవు దినాలు కావడంతో తమ తల్లిదండ్రులు తమని చూడటానికి రాలేదని తమలో తాము బాధ పడుతూ ఎవ్వరికి చెప్పకుండా హాస్టల్ గోడ దూకి పారిపోయారు. సమాచారం రాగానే పోలీసులు వెంటనే వివిధ వాట్సాప్ గ్రూపులలో వారి ఫోటోలను షేర్ చేశారు. విద్యార్థులు ఆకుతోటపల్లి గేట్ వద్ద ఉన్నారని సమాచారం తెలియడంతో పెట్రోలింగ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రోషనప్ప, కానిస్టేబుల్ రాషేద్ ఖాన్ లు స్పందించి వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో హెూస్టల్ వార్డెన్ కు అప్పగించామని పోలీసులు తెలిపారు.






# పాఠశాలలకు వాటర్ ట్యాంక్ వితరణ

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు ఐదు వందల లీటర్ల వాటర్ ట్యాంక్ లను తాడూర్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల, మేడిపూర్ ఉన్నత పాఠశాలలకు మాజీ గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా సోమవారం అందజేసారు. ముఖ్య అతిధిగా హాజరైన మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు విద్యార్థులకు నీటి నిల్వ కొరకు వాటర్ ట్యాంక్ ను అందజేశామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. తాడూర్ మండలంలోని చాలా పాఠశాలలకు వాటర్ ట్యాంక్స్ ఇదివరకే అందచేశామని తెలిపారు. నాగర్ కర్నూల్ ప్రాంతంలోని అన్ని పాఠశాలలు, దేవాలయాలు, ఇంకా ప్రజల సేవ కోసం పనిచేస్తున్న ఏ ఇతర సంస్థకైనా వాటర్ ట్యాంకులు అవసరం ఉంటే లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించాలని కోరారు. క్లబ్ అధ్యక్షులు రాధారెడ్డి, మాజీ గవర్నర్ రాధా కృష్ణ తో పాటు కార్యదర్శి వాస లక్ష్మి, మాజీ అధ్యక్షులు దొడ్ల రాజవర్ధన్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, ప్రేమకుమార్ రెడ్డిలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ రెడ్డి, రమేష్, సురేష్, వెంకటేష్, పద్మాలయ, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంమోహన్ లు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఉచిత
# కంటి వైద్య శిబిరం విజయవంతం




**విశ్వంభర, ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి లయన్స్ క్లబ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించాలని, నేత్రదానం చేయండి చిరంజీవిలు కండి అని ఆయన పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ద్వారా నేత్రదానం ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. మనిషి మరణించిన తర్వాత ఆరు గంటల లోపు నేత్రదానం చేయవచ్చని ఆయన అన్నారు. మరణించిన మనిషి మట్టిలో కలిసిపోతే కళ్ళు కుళ్ళిపోతాయని అవేకళ్ళు దానం చేయడం మరొకరికి చూపు ఇచ్చిన వారమవుతామని అన్నారు.

ఈ శిబిరంలో కంటి వైద్యులు ఏం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 75 మందికి పరీక్షలు నిర్వ హించి 25 మందిని రాంరెడ్డి లయన్స్ క్లబ్ హాస్పిటల్ కు తరలించినట్లు క్లబ్ పీఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ పరీక్షితు, క్లబ్ జిల్లా చైర్మన్ జూలరి రమేష్, కోశాధికారి గుజ్జరి నరసింహ, కంటి వైద్యులు చంద్రశేఖర్, జిల్లా చైర్మన్ బి. యాదయ్య క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, క్లబ్ పీఆర్ఓ పాషా పాల్గొన్నారు.



## ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం

**విశ్వంభర, మల్లాపూర్:** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మల్లాపూర్ మండలం వీవీ రావుపేట్ గ్రామంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో 7 నెలల కాలంలోనే 36 మంది విద్యార్థులు వివిధ కారణాల వల్ల మృతి చెందడం దురదృష్టకరమని ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అకారణంగా మృతి చెందడంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెడికల్ కాలేజీ కోసం భూపరిశీలన చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో 64 వ సర్వే నెంబర్ లో మెడికల్ కాలేజీ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హన్మంత్ జెండగేతో కలసి మెడికల్ కాలేజికి అవసరమయ్యే 20 ఎకరాల భూమిని పరిశీలించారు. వీరితో పాటు ఆర్డీవో, ఎమ్మార్వో, ఇతర అధికారులు, స్థానికులు ఉన్నారు.

## ఆత్మకూరు(ఎం)లో "హర్ ఘర్ తిరంగా"



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో బీజేవైఎం రాష్ట్ర యువ మోర్చా పిలుపు మేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బీజెవైఎం ఆత్మకూరు(ఎం) మండలం అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి శుభ్రం చేసి వారికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారి సత్య నారాయణ, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి మధు, బీజేవైఎం కార్యదర్శి వనం మధు, బీజేవైఎం అధికార ప్రతినిధి పొన్నగని సూర్య ప్రకాష్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య మండల నాయకులు పరకాల రాంబాబు యాస వెంకటరెడ్డి గడ్డం స్వామి పాల్గొన్నారు.

## భక్తులకు కొంగు బంగారం తాపాల లక్ష్మీ నరసింహ స్వామి



**విశ్వంభర, కరీంనగర్:** తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ లోని స్వయంభూ తపాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం భక్తులకు కొంగు బంగారంగా మారింది. భక్తులు కోరికలు తీర్చే స్వామిగా, వివాహ శుభకార్యాలకు కరీంనగర్ జిల్లాలోనే శ్రీ తపాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది. ఈనెల 13 నుండి దేవాలయ 20వ అధ్యాయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేద పండితులు, దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీ తిరునగిరి వేంకటాద్రి స్వామి నేతృత్వంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు 13వ తేదీ నుండి 19వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవాలయ కమిటీ తగిన ఏర్పాటు చేసింది. 13,14,15 తేదీల్లో విశేష పూజ కార్యక్రమాలు, 17 వ తేదీన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవము, సామూహిక అన్నదాన కార్యక్రమం, సామూహిక కుంకుమార్చనలు, హోమ కార్యక్రమాలు, 18,19 తేదీల్లో వివిధ పూజా కార్యక్రమాలను సహాయ అర్చకులు శ్రీ తిరునగిరి చక్రధర స్వామి, పరంకుశం వెంకటరమణ, తిరుకోవళ్ళూర్ కిరణ్ కుమార్, అభిలాష్, లక్ష్మీ వర్ధన్, హర్షవర్ధన్, విష్ణువర్ధన్ల చే నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్టు దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

## యువత దేశానికి మార్గ నిర్దేశకులు కావాలి

**విశ్వంభర, తలకొండపల్లి:** ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా తలకొండపల్లి మండలం గట్టిప్పులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదే రేణు రెడ్డి మండల యువతకు శుభాకాంక్షలు తెలియజేశారు. యువత సన్మార్గంలో పయనిస్తూ దేశానికి మార్గనిర్దేశకులు కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ యువత రాణించేలా ప్రభుత్వం కార్యాచరణ తీసుకుందన్నారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐ లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్పు, క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమేనని వాటిని ఉపయోగించుకొని యువత ఉపాధి అవకాశాల ను కల్పించుకోవాలని పేర్కొన్నారు.



# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**విశ్వంభర, కరీంనగర్:** గత పదేళ్ళలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా సోమవారం నగర మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి 6 వ డివిజన్ లో పర్యటించారు. పాతబజార్ ప్రాంతంలో స్థానిక కార్పోరేటర్ కోల మాలతి సంపత్, ఇంచార్జ్ కమీషనర్ ప్రఫుల్ దేశాష్ తో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్ రావు నగరపాలక సంస్థ ఎల్ ఆర్ ఎస్ కు చెందిన 27 లక్షలతో వివిధ కాలనీలలో ఎస్ డబ్లుజీ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణంకు భూమీ పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్ రావులు గల్లీలో పాదయాత్ర చేసి సమస్యలను తనిఖీ చేశారు. స్థానిక మహిళలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చేపట్టిన సీసీ రోడ్డు, ఎస్ డబ్లుజీ డ్రైనేజీ పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్ లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, పద్మ కృష్ణ, ఇంజనీరింగ్ అధికారుల, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలి



**విశ్వంభర, వికారాబాద్:** అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం జిల్లా సమాఖ్య భవనంలో జిల్లా సమాఖ్య అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశం పాల్గొని జిల్లాలోని అన్ని మండలాల వారిగా వారి పరిదిలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిదులను దుర్వినియోగం కాకుండా పిల్లలకు ఉపయోగ పడేవిధంగా పనులు చేయి0చాలని ఆదేశించారు. మండలం వారిగా మండల సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలని మండల సమాఖ్య అధ్యక్షులకు ఆదేశించారు. ఒక్కొక్కరికి ఎన్ని స్కూల్స్ ఉన్నాయి, ఇప్పటి వరకు ఎంత బడ్జెట్ మంజూరు అయినది, బడ్జెట్ ను బట్టి ఎన్ని స్కూళ్ల లో ఎన్ని పనులు పూర్తి చేశారని, మండలం వారిగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూళ్ల వారిగా మైనర్ మేజరు రిపేర్ కు అయిన ఖర్చుల వివరాలు సబ్మిట్ చేయాలన్నారు. మహిళా అభివృద్ధి పై ద్రుష్టి సారించాలని అన్నారు. గ్రామీణాభివృద్ధి సౌజన్యం తో స్కూల్ యూనిఫార్మ్ తయారిలో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసి విద్యార్థిని విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఎ శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీఓ సరోజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, ఐకేపీ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ ప్రతీక్ జైన్

**విశ్వంభర, వికారాబాద్:** ప్రజల నుండి వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా ఎపటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కల్లెక్టరేట్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన ప్రజా వాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సుమారు 150 పిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన పిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే ప్రరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధరణి, భూసర్వే, ఆసరా పెన్షన్ లకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. వివిధ మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన పిర్యాదులను పరిశీలించారు. సమస్యలకు సంబంధించిన పిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కేరళ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- వయనాడ్ ప్రాంత వాసులకు ప్రజలు బాసటగా నిలవాలి
- వరద బాధితుల నిధి సేకరణ కార్యక్రమం చేపట్టిన ఏఐవైఎఫ్




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐవైఎఫ్ ఆత్మకూరు(ఎం)మండల కమిటీ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం వయనాడ్ లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా కొండ చరియలు విరిగిపడ్డ ఘటనలో వందలాది మంది ప్రజలు మృత్యువాత పడ్డారు. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. అలా మృత్యువాత పడి నిరాశ్రయులు అయిన బాధితులకు అండగా నిలవాలని ఏఐవైఎఫ్ మండల కమిటీ వరద బాధితుల సహయ నిధి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, కేరళ రాష్ట్రానికి చేయూతగా 5వేల కోట్లను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ ఆకస్మిక విపత్తులు సంభవించినా ప్రజలంతా ఐక్యమత్యంతో సహాయ సహకారాలు అందిచాల్సిన బాధ్యత పౌరులపై ఉంటుందని వారు ఉద్ఘటించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయక చర్యలను వేగవంతం చేసుకోవడానికి పటిష్ట అధికార యంత్రాంగాన్ని తయారు చేయాలని వారు అన్నారు. అదేవిధంగా విపత్తులను ముందుగానే పసిగట్టడానికి మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నయీమ్, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సుద్దాల సాయికుమార్, మేడి దేవేందర్ మహిళా సమాఖ్య నాయకురాలు గుర్రం రాజమణి, సీపీఐ నాయకులు బొబ్బాల లాల్ రెడ్డి, కలువల నర్సయ్య, పంజాల వెంకటేష్, ఇంజమీరి నర్సింహ్మ పాల్గొన్నారు.



నవాబ్ పేట్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్, వికారాబాద్ జిల్లా ఎస్పీ కె నారాయణరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. (విశ్వంభర, వికారాబాద్)




## గంగాధర్, హర్షవర్ధన్ రాజుకు ఘన సన్మానం

**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్ పల్లి మండలం వేంపేట గ్రామం సేవా భారతి ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ వారిచే గోల్డ్ మెడల్ పొందిన సందర్భంగా ఆల్ రౌండర్ గంగాధర్ కి, అండర్ 12 రన్నింగ్ రేసులో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన చిట్టాపూర్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ రాజుకు సేవా భారతి అధ్యక్షులు గాజంగి రాజ మల్లయ్య ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా మార్చిన ఘనత గంగాధర్ సార్ కు దక్కుతుందని పదవి విరమణ తర్వాత కూడా క్రీడాకారులలో ఉత్సాహాన్ని నింపుతూ ఉన్నతంగా తీర్చిదిద్దడం వారి గొప్పదనం అన్నారు. చిన్న వయసులో మారు మూల గ్రామమైన చిట్టాపూర్ నుండి రాష్ట్రస్థాయి క్రీడాకారునిగా ఎదగడం హర్షవర్ధన్ రాజు లాంటి క్రీడాకారులకు మాత్రమే చెందుతుందని, పల్లెల్లో పుట్టిన పగడాలను, మట్టిలోని మాణిక్యాలను గుర్తించి సన్మానించడం క్రీడాకారులకు అందరికీ దక్కిన గౌరవమని అన్నారు. హర్షవర్ధన్ లాంటి క్రీడాకారున్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ సెల్ ఫోనులలో నిమగ్నం కాకుండా క్రీడా ప్రాంగణాల వైపు దృష్టి సారించి, శారీరక సౌష్టవాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి, విష్ణువర్ధన్ రాజు, జయ కృష్ణ, రామస్వామి పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం చిన్నగూడెం గ్రామంలో నిమ్మల దశరథకి చెందిన ఎద్దు విద్యుత్ తీగలు తగిలి షాక్ తో మృతి చెందింది. ఈ ప్రమాదం నుండి రైతు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు.

(విశ్వంభర, ఆత్మకూరు(ఎం))

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**విశ్వంభర, హైదరాబాద్:** సమాజంలో బహుముఖ ప్రజ్ఞాశాలులుగా ఎదగాలని, తద్వారా దేశాభివృద్ధికి తమవంతు కృషి చేయాలనీ డీఆర్ఎస్ ఐఎస్ డైరెక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్ అన్నారు. హైదరాబాద్, గుడ్లపోచంపల్లి, డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎస్ ఐఎస్ లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను కలసి సెల్ఫీలతో పాటు ఫోటోలను తీసుకొని, తమ జీవితములో గుర్తుండేలా పెట్టుకుంటామని తెలిపారు. అనంతరం అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ పిల్లలకు పాఠశాల రెండవ ఇల్లు, వారిని మంచి మనుషులుగా తీర్చిదిద్దడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని, పిల్లల పాత్రను రూపొందించడమే కాకుండా, ధైర్యంతో ప్రపంచాన్ని ఎదుర్కోవటానికి పాఠశాల అతనికి సహాయపడుతుందని అనారు. డీఆర్ఎస్ ఐఎస్ డైరెక్టర్ గార్వ్ అగర్వాల్ మాట్లాడుతూ పాఠశాల,




కళాశాల జీవితం నుండి వాస్తవ ప్రపంచానికి మారడం ఒక పెద్ద పరివర్తన అని, భిన్నంగా ఉండటానికి, ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మిమ్మల్ని మీరు విశ్వసించలని కోరారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**విశ్వంభర, మీర్‌పేట్:** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల పరిధిలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పీ. సబితా ఇంద్రారెడ్డి మీర్ పేట్ జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ ప్రభుత్వం లో నిరుపేదలకు తగినంత సహాయం అందడం లేదని అన్నారు. నిరుపేదలు మాత్రమే వినియోగించుకునే సీఎంఆర్ఎఫ్ లాంటి పథకాన్ని చిన్నచూపు చూడకుండా ఇంకా ఎక్కువ నిధులు కేటాయించి పేదలకు న్యాయం చెయ్యాలని అన్నారు.

కందుకూరు మండలం పరిధిలో మంజూరైన 66 చెక్కులు సుమారు రూ. 17,50,000లు లబ్ధిదారులకు అందజేసినట్లు సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, పీఏసీ చైర్మన్ చంద్ర శేఖర్, వైస్ చైర్మన్ విజయేందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ డెలివరి లక్ష్యాలను సాధించాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** సోమవారం ఐడీఓసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేయుటపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం 2023 కు సంబంధించిన 16 వేల మెట్రిక్ టన్నుల సీ.ఏం.ఆర్ పెండింగ్ లో ఉందని సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ లో రా రైస్ కు ఎక్కువ డిమాండ్ ఉందని మిల్లర్లు ఎంత ఎక్కువగా మిల్లింగ్ చేస్తే అంత తొందరగా రానున్న వానాకాలం పంటకు మిల్లర్లు సిద్ధంగా ఉండొచ్చని అన్నారు. మిలర్లతో ప్రతి 15 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మిల్లర్లు సీ.ఏం.ఆర్ డెలివరిలో జాప్యం వహిస్తే అట్టి ధాన్యాన్ని మరొక మిల్లుకు కేటాయిస్తామని అన్నారు. క్రమం తప్పక మిల్లులు పని చేయాలని రేపటి నుండి రెవెన్యూ అధికారులు మిల్లింగ్ తీరును తనిఖీ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డి ఎం రాఘవేంద్ర. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

# సంపూర్ణతా అభియాన్ లక్ష్యాలను సాధించాలి



కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** సంపూర్ణతా అభియాన్ కార్యక్రమ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీతి అయోగ్ యాస్పిరేషనల్ బ్లాకుగా గుర్తించిన మారుముల మండలాలైన పలిమెల, మహముత్తారం మండలాలలో సంపూర్ణతా అభియాన్ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వ హించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో వెనుక బడిన మండలాలలైన పలిమెల, మహాముత్తారం మండలాలలను నీతి అయోగ్ యాస్పి రేషనల్ బ్లాకులుగా గుర్తించడం జరిగిందని అన్నారు. యాస్పిరేషనల్ బ్లాకుగా గుర్తించిన మండలాలలో సంపూర్ణతా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రెండు మండలాలలోని ప్రజలకు వైద్య సేవలు అం దించాలని, 35 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. బీపీ, మధుమేహం థైరాయిడ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీఓ శామ్యూల్ తో పాటు రెండు మండలాలకు చెందిన యాస్పి రేషనల్ బ్లాక్ ఫెలోస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సత్కారాలతో మరింత పెరిగిన బాధ్యత

## వక్కలంక శ్రీనివాసరావు

**విశ్వంభర, ఎల్బీనగర్:** చేసిన సేవా కార్యక్రమాలకు సత్కరించడంతో మరింత బాధ్యత పెరిగిందని బ్రాహ్మణ సేవా సంఘం సమాక్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. సోమవారం దిల్ సుఖ్ నగర్ లోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బ్రాహ్మణులకు సేవలు అందించినందుకు గాను తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మోతుకూరి రామేశ్వర రావు, గౌరవ సలహాదారులు బోరుబట్ల హనుమంతచారి, ప్రధాన కార్యదర్శి గాడిచేర్ల నాగేశ్వర సిదాంతి చేతుల మీదుగా శ్రీనివాస రావుకు సేవా పురస్కారాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం సంపాదించిన సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమానికి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల విజయసారథి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు దేవులపల్లి వాణి, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ నిమిలికొండ కిరణ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు కల్పవల్లి, వంశీ, శశీధర్, వాణిశ్రీ, జయతులసి, అనిల్, భాస్కరమూర్తి, రఘునందన్, విజయలక్ష్మి, జయప్రకాష్ పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాళ్లనే నియమించాలి

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం మండల కేంద్రంలో సేవాలాల్ సేన సమావేశం భుక్య నరేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్, జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ మధ్యకా లంలో బాలికల ఆశ్రమ పాఠశాలలో అమ్మాయిలపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతుంన్నాయని అన్నారు. వీటన్నిటికీ కారణమైన అధికారులపై ప్రభు త్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల పాఠశాల లలో ఏ విధంగా పురుష ఉపాధ్యాయులను లేదా సిబ్బందిని నియమిస్తారని ప్రశ్నించారు. బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాళ్లను మాత్రమే నియమించాలని నిబంధనలు చెబుతున్న నిబంధనలకు విరుద్ధంగా పురుష ఉపాధ్యాయులను బాలికల పాఠశాలలో నియమిస్తున్నారని మండిపడ్డారు. గిరిజన బాలికల మానంతో ఆట ఆడుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికల పాఠశాలలలో పనిచేస్తున్న పురుష ఉపాధ్యాయులను తొలగించకపోతే సేవాలాల్ సేన పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్, బూర్గంపాడు సీతారాం నాయక్, సురేష్ నాయక్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

# ఆర్కేపురం డివిజన్ లో బోనాల పండుగ

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజక వర్గం ఆర్కేపురం డివిజన్ లోని ఎన్టీఆర్ నగర్ పేస్ -2, మార్గదర్శి కాలనీ, సౌభాగ్యపురం కాలనీలో బోనాల పండుగ సందర్భంగా ఫలహార బండి కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు పగడాల దీపక్, శ్రీకాంత్ యాదవ్, నరేంద్రనాయక్, కిల్లా లోకి, కపిల్ దేవ్, విశాల్ దేవ్ పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికుల సమస్యలపై ఆర్డీఓకి వినతి

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం గ్రామపంచాయతీ కార్మికుల ఒకరోజు సమ్మె శిబిరాన్ని ప్రారంభించిన వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులు సమ్మె చేసినప్పుడు వారి సమ్మెను పట్టించుకోకపోతే ఆనాడు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు శిబిరాల వద్దకు వచ్చి అనేక ఉపన్యాసాలు ఇచ్చి మేము అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల కనీస వేతనం 26,000 చేస్తామని, అర్హులైన వాళ్ళందరిని పర్మినెంట్ చేస్తామని, పని భద్రత కల్పిస్తామని, వారి సమస్యలు మొత్తం పరిష్కరిస్తామని ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను కనీసం పట్టించుకునే పరిస్థితిలో లేదని విమర్శించారు. ఈరోజు ఒక్కరోజు సమ్మెతో సరిపెట్టామని భవిష్యత్తులో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో నిరవధికసమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మె అనంతరం ర్యాలీగా ఆర్డీఓ ఆఫీస్ కి వెళ్లి అక్కడ నిరసన తెలియజేసి ఆర్డీఓ కి మీద వినతి పత్రం అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ గతంలో జిల్లా కలెక్టర్ కి, రాష్ట్ర కమిషనర్ కి, రాష్ట్ర మంత్రి సీతక్క కి అనేక దఫాలుగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల మీద రిప్రజెంటేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వాలు స్పందించడం లేదని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాకాస జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి సీఐటీయూ పట్టణ నాయకులు ఎం నాగరాజు, జి లక్ష్మణ్, రామకృష్ణ, మురళి, ప్రసాద్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు చెన్నకేశవులు, శ్రీను, మనోజ్ రెడ్డి, విజయ, భాను, రజనీకాంత్ పాల్గొన్నారు.





మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీ బోనాల పండుగలో భాగంగా నిర్వహించిన పలహార బండి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, వారితోపాటు శ్రీశైలం, రామకృష్ణ, కిట్టు, నాని, వరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.
(విశ్వంభర, ఎల్బీనగర్)

# ఏఐఎస్ఎఫ్ 89 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్లో ఏఐఎస్ఎఫ్ 89 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సరూర్నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి కుమార్ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12 న ఆవిర్భవించింది అని అన్నారు. వారి ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశి వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అరుణ్, సరూర్నగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాతరాజు భవానీ, పి.వినోద్, సహాయ కార్యదర్శి రేణుక, కార్యవర్గ సభ్యులు ఉష, భాగ్య, శ్వేత, నికిత, అరవిందు, వేణు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడాలి

**విశ్వంభర, చింతపల్లి:** ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణ కేంద్రంలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ జండా ఆవిష్కరించి అనంతరం అయన మాట్లాడారు. త్యాగాలు, పోరాటాలే ధ్యేయంగా అఖిల భారత విద్యార్థి సంఘం పనిచేస్తుందని, శాస్త్రీయ విద్య విధానం అమలు, విద్యా కాషాయ కరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందని, మరో పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్రం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్ట మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్ లక్నో నగరంలో ఏర్పాటు కాబడి నేటికీ 88సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ వసంతంలో అడిగిపెట్టి సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. మెకాలే విద్యా విధానం మాకొద్దంటూ విద్య రంగంలో సంస్కరణ కోసం పోరాడి కొఠారి కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ దే అన్నారు. ధరలు అనుగుణంగా మేస్చార్జీలు, స్కాలర్షిప్స్ పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా విధానాన్ని ధ్వంసం చేసే కుట్రలను తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్, కార్యదర్శి షేక్ శంశోద్దీన్, ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి జూలూరి వెంకట్రాములు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు అనిల్ యాదవ్, సిద్దార్థ్, దినేష్, వినోద్, అరవింద్, వంశీ, జ్యోతి, మాధవి, అంజలి, అరుణ, స్వాతి పాల్గొన్నారు.




ఎల్పీజీ మెకానిక్ కోర్స్ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, చిత్రంలో సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, హెచ్పీసీఎల్, ఐఓఎల్, బీపీసీఎల్ అధికారులు



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి
# సత్వర చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 43 దరఖాస్తులు ప్రజావా ణిలో వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధి లోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో మత్తు పదార్థాలు నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. జిల్లా అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.

# ఘనంగా నేషనల్ డాన్స్ కాంపిటీషన్



**విశ్వంభర, బషీర్ బాగ్:** కళాకార్ తెలుగు టీవీ అద్వర్యంలో క్లాసికల్, వెస్ట్రెన్ నేషనల్ డాన్స్ కాంపిటీషన్ హైదరాబాద్ లో 2 రోజులు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి క్లాసికల్ విభాగంలో 150 కళాకారులు సోలో డ్యూయెట్, గ్రూప్ విభాగంలో పాల్గొన్నారు. క్లాసికల్ సోలో సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఆద్రీజ, ద్వితీయ బహుమతి గజ్జెల శ్రేష్ఠ, తృతీయ బహుమతి ఆర్య తేజస్ జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పొపూరి షణ్ముఖ వేద, ద్వితీయ బహుమతి శరణ్య, తృతీయ బహుమతి అనేఘ, సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సమీక్ష, ద్వితీయ బహుమతి అలేఖ్య చింద, తృతీయ బహుమతి రియ పంచల్, స్పందన సబ్ జూనియర్ డ్యూయెట్ విభాగంలో ప్రథమ బహుమతి గీతిక, ప్రేక్ష ద్వితీయ బహుమతి జైత్ర ఆనంది, తులసి ఆనంది, జూనియర్ డ్యూయెట్ ప్రథమ నిత్య, హాసిని, ద్వితీయ, అక్షర, అక్షిత, సీనియర్ డ్యూయెట్ విభాగంలో ప్రతమ విలక్షణ, స్తుతి ద్వితీయ బహుమతి పూజిత, నీరజ, సబ్ జూనియర్ గ్రూప్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రీకర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి జూనియర్ గ్రూప్ ప్రథమ బాహుమతి ఫ్యూచర్ టీచర్ అకాడమి, ద్వితీయ బహుమతి సృజన డాన్స్ అకాడమి, తృతీయ బహుమతి బి 9 డాన్స్, ఫిట్నెస్ స్టూడియో సీనియర్ గ్రూప్ ప్రతమ బహుమతి ఫ్యూచర్ టీచర్ అకాడమి, ద్వితీయ బహుమతి శ్రీకర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి, తృతీయ బి 9 డాన్స్, ఫిట్నెస్ స్టూడియో, నేషనల్ ఓవర్ అల్ ఛాంపియన్ షిప్ ప్రథమ బహుమతి ఫ్యూచర్ టీచర్ అకాడమి, ద్వితీయ బహుమతి శ్రీకర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి, తృతీయ బహుమతి సరస్వతి నృత్య అకాడమి గెలుచుకున్నారు. విజేతలందరికి అతిథులు గా విచ్చేసిన ఏఎస్పీ రామదాసు తేజవత్, క్లాసికల్ డాన్స్ న్యాయ నిర్ణేతగా విచ్చేసిన గురు డా. శ్రీనివాస రావు, సరస్వతి ఉపసకులు దైవజ్ఞ శర్మ, వెస్ట్రెన్ డాన్స్ న్యాయ నిర్ణేతగా ప్రముఖ కోరయోగ్రాఫర్ హరినాథ్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. కాంపిటీషన్ విజయవంతం చేసిన గురువులకు చిన్నారులకు తల్లి తండ్రుల కు సిరాజ్ మాస్టర్ ధన్యవాదాలు తెలిపారు.



# వనమహెూత్సవంపై సమీక్ష

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సోమవారం రోజు ఎంపీడీఓ కార్యాలయంలో వనమాహెూత్సవం పైన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులుతో ఎంపీడీఓ రాములు నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇంటింటికి అందచేసిన మొక్కలకు జీయో ట్యాగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో పాల్గొన్న ఎంపీఓ జులూరు పద్మావతి, ఉపాధి హామీ సిబ్బంది ఏపీఓ బోడిగే రమేష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సుంకరి శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు దంతూరి శ్రీశైలం, జమాండ్ల యాదిరెడ్డి, జెట్ట నిర్మల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## గంజాయిని పట్టుకున్న మహదేవపూర్ పోలీసులు

**విశ్వంభర, కాటారం:** భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో ఎస్సై పవన్ కుమార్ ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర నుంచి 415 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి మేడిగడ్డ మీదుగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో వెంటనే ఎస్ఐ పవన్ తన సిబ్బందితో మేడిగడ్డ బ్యారేజ్, అంబటిపల్లి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఒక పల్సర్ బైక్ అనుమానాస్పదంగా ఉండడంతో బైక్ ను ఆపి తనిఖీ చేయగా బైక్ ముందు కవర్లో నిషేధిత గంజాయి కనబడింది. వారిని విచారించగా కారుపాక శ్రీనాథ్, జగదీష్ వారు భూపాలపల్లి నివాసులని మహారాష్ట్ర వ్యక్తి నుండి నిషేధిత గంజాయిని కొనుగోలు చేసి, అందులో కొంత భాగం వారు వినియోగించుకొని, మిగతాది భూపాలపల్లి లో అవసరమైన వ్యక్తులకు అధిక ధరకు అమ్ముతుంటారని తెలిపారు. పల్సర్ బైక్ ను సీజ్ చేసి ఇద్దరి వక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ పవన్ కుమార్ తెలిపారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ని
# కలిసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు లోని వివిధ మండల అధ్యక్షులు, ముఖ్య నేతల తో కలిసి ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ కు సంబంధించిన పలు సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. మునుగోడు నియోజకవర్గంలో 21 కొత్త రూట్లలో పలు గ్రామాలను కలుపుతూ ఆర్టీసీ బస్సులు నడిపించాలని రాజగోపాల్ రెడ్డి కోరారు. నియోజకవర్గానికి కొత్త బస్సులు మంజూరు చేయాలని, ప్రతి మండల కేంద్రంలో ఉన్న బస్ స్టేషన్ పను అప్గ్రేడేశన్ తో పాటు శానిటేషన్ ఫండ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దాంతో పాటు మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి, నారాయణపూర్ మండలాలకు నూతన బస్ షెల్టర్ల నిర్మాణం చేయాలని కోరిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి. ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ఇచ్చిన వినతుల పై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు.





# ఈ భూమి సకల జీవులది

- ఏనుగులను కాపాడుకోవాలి
- బెంగళూరు సదస్సులో మంత్రి కొండా సురేఖ

**బెంగళూరు:** ఈ భూమి మనుషులకు మాత్రమే ఆవాసం కాదనీ, సకల జీవులకు ఈ భూమిపై జీవించే హక్కు ఉందనే సత్యాన్ని గుర్తించాలని అటవీ, పర్యావరణ శాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని(ఆగస్టు 12) పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నిర్వహించిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ హ్యూమన్-ఎలిఫెంట్ కాన్ఫ్లిక్ట్ మేనేజిమెంట్" సదస్సులో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఏనుగులు, మనుషుల మధ్య సంఘర్షణ, వాటి సంరక్షణ, నిర్వహణ పై అర్థవంతమైన చర్చ జరిగేందుకు కర్ణాటక ప్రభుత్వం ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును చేపట్టడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ, సహజ వనరుల నిర్వహణ రంగంలో పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ ఏనుగులను అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో చేర్చడం మానవ వైఫల్యాన్ని నిరూపిస్తున్నదని మంత్రి సురేఖ అన్నారు. దంతాల కోసం ఏనుగులను క్రూరంగా వేటాడటం, అటవీ భూములు, నీటి వనరుల ఆక్రమణ, అడవుల నిర్మూలనతో ఏనుగులు ఆవాసం కోల్పోయి, ఆహార సేకరణ కోసం వలసపోతూ ప్రమాదాలను ఎదుర్కంటున్నాయని మంత్రి ఆవేదనను వ్యక్తం చేశారు. ఏనుగుల ఆవాసాల్లో అటవీసంపదను, నీటి వనరులను మెరుగుపరచడం, ఏనుగులు పంట పొలాల్లోకి, జనావాసాల్లోకి వచ్చినపుడు సంయమనంతో వ్యవహరించడం ద్వారా అవి ప్రమాదాలకు లోనుకాకుండా నివారించవచ్చునని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె. శివ కుమార్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి ఖండ్రే, పలు రాష్ట్రాల అటవీ శాఖా మంత్రులు, , పలువురు దేశ, విదేశాలకు చెందిన అటవీరంగ నిపుణులు, రీసర్చ్ స్కాలర్ లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాచం ఫౌండేషన్
# ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



**విశ్వంభర, హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ పట్టణంలో పంగ సాలెమ్మ ఆరోగ్య పరిస్థితిలు బాగోలేని కారణంగా కాళ్లు చేతులు పని చేయకపోవడంతో ఫిజియోథెరపీ కోసం సుమారు నెలకు 30000 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పంగ సాలెమ్మ కుటుంబం నిరుపేద కావడంతో వారు ఆర్థిక సాయం కోసం కాచం ఫౌండేషన్‌ను సంప్రదించారు. విషయం తెలుసుకున్న కాచం ఫౌండేషన్ ఫౌండర్ కాచం సత్యనారాయణ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కంటూ నాగరాజు, శాఖ పౌండేషన్ సభ్యులు మధు, లింగయ్య, బలవంత్ సింగ్, ఇంటి రవి, వెంకీ, రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**విశ్వంభర, వెల్దండ:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగాలని శ్రేష్ఠ ఫౌండేషన్ చైర్మన్ శ్యాపూరి సుష్మా రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షూలను అందజేశారు. ఈ సందర్భంగా సుష్మా రవీందర్ రెడ్డి మాట్లాడారు. శ్రేష్ఠ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని కోరారు. సుష్మా రవీందర్ రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు శాలువా లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, తాజుద్దీన్, ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు జంగయ్య, కిష్టారెడ్డి రామకిషన్ రావ్, మురళీధర్, సురేష్, జైపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి కేసులో ముగ్గురి అరెస్టు

**విశ్వంభర, మాడుగుల:** మాడుగుల మండలంలోని సుద్దపల్లిలో ఇటీవల జరిగిన అర్కపల్లి వాసి పందుల లింగం పై జరిగిన హత్యాయత్నం కేసులో సోమవారం ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో నిందితులు అర్కపల్లికి చెందిన జగతయ్య, సుద్దపల్లిని చెందిన పందుల బాలరాజు, అర్కపల్లికి చెందిన యాచారపు బిక్కయ్య లను అరెస్టు చేసి రీమాండ్ కు తరలించినట్లు రాచకొండ ఏసీపీ తెలిపారు.



## మహిళా వైద్యురాలిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి

**విశ్వంభర, బషీర్ బాగ్:** కలకత్తాలో మహిళా వైద్యురాలిని డ్యూటీలో ఉండగానె కిరాతకంగా హతమార్చిన ఘటన మానవ సమాజానికి సిగ్గు చేటు అని, ఇంతటి ఘోరానికి పాల్పడిన నేరగాళ్లకు కఠినంగా శిక్షించాలని డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు, తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ డాక్టర్ లక్ష నాయుడు డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఆగస్టు 9న ఆర్‌జీ కర్ర్ మెడికల్ కాలేజీ కొలకత్తాలోని ఛాతీ వైద్య విభాగంలో, సెమినార్ రూమ్‌లో జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు జరగడానికి పని ప్రదేశాల్లో పటిష్ఠమైన భద్రత లేకపోవడమే కారణం అన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆసుపత్రి యాజమాన్యం మహిళా వైద్యురాలికి కుటుంబానికి పరిహారం అందించాలన్నారు. ప్రాణాలు కాపాడే డాక్టర్ ల కే భద్రత లేక పోతే మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉంటుందని, మహిళల భద్రతకు సంబంధించిన ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, తగు చర్యలు తీసుకుని మహిళలకు భద్రత కల్పించాలని డాక్టర్ లక్ష నాయుడు కోరారు.

# మౌనంగా ఉండడం భావ్యం కాదు

- ఒక దేశంలోని అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం సరైన చర్య కాదు
- అలా చేస్తే.. విదేశాంగ విధాన వైఫల్యమే అవుతుంది
- సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ:** తమ రాజకీయ ఉద్దేశాలను నెరవేర్చుకునేందుకు పొరుగు దేశంలోని పరిస్థితులను ఉపయోగించుకుంటే చివరికి ఆ దేశమే బలహీన పడుతుందని సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. అయితే.. ఆయన ఏ దేశం పేరును ప్రస్తావించలేదు. అయితే.. బంగ్లాదేశ్లోలో పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది."ఒక దేశంలోని పరిస్థితులను మరో దేశం ఆసరాగా చేసుకుని.. తమకు అనుగుణంగా ఉపయోగించుకోవాలనుకుంటే అది వారిని అంతర్గతంగా, బాహ్యంగా బలహీనపరుస్తుంది. వాస్తవానికి ఒక దేశంలోని అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం సరైన చర్య కాదు. అక్కడ ప్రదర్శనలు హింసాత్మకంగా మారితే.. మౌనంగా ఉండడం భావ్యం కాదు. అది విదేశాంగ విధాన వైఫల్యమే అవుతుంది" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అఖిలేశ్ పేర్కొన్నారు. నాలుగు గంటల వ్యవధిలో ఆయన చేసిన మరో పోస్టులో బంగ్లాదేశ్ పేరును ప్రస్తావించారు. "సరైనదా కాదా అనే విషయాలను పక్కనపెడితే.. పలు సందర్భాల్లో, వివిధ కారణాలతో అనేక దేశాల్లో హింసాత్మక విప్లవాలు, సైనిక తిరుగుబాట్లు, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు జరుగుతున్నాయి. అటువంటి సమయంలో ఆ ఒక్క దేశం మాత్రమే తిరిగి పుంజుకుంది. బంగ్లాదేశ్లో శాంతి స్థాపనకు కేంద్రప్రభుత్వం మరింత కృషి చేయాలి. మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన ఈ అంశాన్ని భారత ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తాలి" అని పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్లో పరిణామాల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా.. రిజర్వేషన్ల అంశం పెట్టిన చిచ్చు బంగ్లాదేశ్లో ఆందోళనలను రగిలిస్తూనే ఉంది. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా ప్రస్తుతం భారత్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం స్పందించిన తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశంసలు కురిపించారు. ఆమెకు మనం సాయం చేయకపోతే.. అది భారత్కు అవమానమేనన్నారు. భవిష్యత్తులో ఎవరూ మనకు మిత్రులుగా ఉండేందుకు ఇష్టపడేవారు కాదని అన్నారు. తాజాగా ఈ అంశంపై స్పందించిన అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ప్రకంపనలు సృష్టిస్తున్న వైద్యురాలి హత్యాచార ఘటన

- ఆరు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచిన ఎయిమ్స్ డాక్టర్లు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- ఆస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలి




**కోల్ కతా:** కోల్ కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు నిరసనగా వైద్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సోమవారం దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫోర్డా (ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తెలిపింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని.. ఆస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. నిరసన నేపథ్యంలో దిల్లీలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు నిలిచిపోయాయి. దిల్లీ ఎయిమ్స్కు చెందిన రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రధానంగా ఆరు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. అవి ఏంటంటే.

- ఈ ఘటనపై వెంటనే సీబీఐతో దర్యాప్తు చేయించాలి.
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి.
- ఆస్పత్రి ప్రిన్సిపల్, సెక్యూరిటీ ఇన్చార్జిలను వెంటనే తొలగించాలి.
- వైద్యుల రక్షణ విషయంలో సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని కేంద్రం వెంటనే అమలు చేసేలా రాతపూర్వక హామీ.
- ఆస్పత్రిలోని బిల్డింగ్కు లేదా లైబ్రరీకి మృతిరాలి పేరు పెట్టాలి.
- తమ డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ ఆందోళన కొనసాగిస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

**రాజీనామా చేసిన ప్రిన్సిపల్..** ఈ ఘటన నేపథ్యంలో ఆందోళనలతో ఆర్జీ కార్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. "మృతురాలు నా కూతురు లాంటిది. ఒక తండ్రిగా రాజీనామా చేస్తున్నాను. భవిష్యత్తులో ఎవరికీ ఇలా జరగకూడదు" అని పేర్కొన్నారు.

**పలువురు డాక్టర్లను ప్రశ్నించిన పోలీసులు..** ఈ కేసుకు సంబంధించి కోల్కతా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ వైద్య కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు డాక్టర్లను, హౌస్ కీపింగ్ సిబ్బంది ఒకరిని ప్రశ్నించినట్లు సమాచారం. ఘటన చోటుచేసుకున్న రాత్రి ఆస్పత్రిలో వీరు విధుల్లో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు.




# బెంగాల్లో దిగజారిన శాంతిభద్రతలు

**కేంద్ర మంత్రి లలన్ సింగ్**

**కోల్కతా:** కోల్కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా దుమారం రేపింది. ఈ ఘటన సిగ్గుచేటని కోల్కతాలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందనేందుకు ప్రత్యక్ష ఉదాహరణని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ (లలన్) సింగ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రజాస్వామిక ప్రభుత్వంలా వ్యవహరించడం లేదని దుయ్యబట్టారు. మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సీఎంగా ఉన్న రాష్ట్రంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. కాగా, ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. వైద్యురాలి హత్యాచార కేసులో దర్యాప్తు ప్రారంభమైందని, నిందితుడిని సత్వరమే అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఆదివారం లోగా పోలీసులు ఈ కేసును ఓ కొలిక్కితీసుకు రాకుంటే కేసును సీబీఐకి అప్పగిస్తామని దీదీ స్పష్టం చేశారు. ఈ ఘటనపై తనకు కోల్కతా పోలీస్ కమిషనర్ సమాచారం అందించగానే విచారకర ఘటన అని చెప్పానని పేర్కొన్నారు. ఆస్పత్రిలో నర్సులు, సెక్యూరిటీ ఉండే క్రమంలో ఈ ఘటన ఎలా జరిగిందనేది తనకు అర్థం కావడం లేదని ఆమె అన్నారు. ఆస్పత్రిలో ఉన్న ఓ వ్యక్తి పనే ఇదని పోలీసులు తనతో చెప్పారని ఆమె వివరించారు. ఆర్జీ కార్ ఆస్పత్రి ప్రిన్సిపల్ ఈరోజు రాజీనామా చేశారని, నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగం, ఇతర బృందాలు పనిచేస్తున్నాయని మమతా బెనర్జీ తెలిపారు.



# వయనాడ్లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

- 130 మంది ఆచూకీ కోసం అడవిలో జల్లెడ
- రెండు వారాలుగా ముమ్మర గాలింపు

**వయనాడ్:** కనీవినీ ఎరుగని విలయాన్ని చూసిన వయనాడ్లో ఇంకా విషాదకర పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే 200లకు పైగా మృతదేహాలను గుర్తించగా.. అనేక మంది జాడ ఇంకా లభించలేదు. దీంతో రెండు వారాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. సుమారు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు పేర్కొన్నారు. వీరి కోసం చలియార్ నది, పరిసర అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. వయనాడ్లో జులై 30న కొండచరియలు విరిగిపడిన ఘటనలో 229 మంది చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో 51 మందిని ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపింది. వీరికి సంబంధించిన డీఎన్ఏ నివేదిక ఆగస్టు 13లోగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాదాపు 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని ప్రభుత్వం వెల్లడించింది. వీరికోసం గడిచిన రెండు వారాలుగా ముమ్మర గాలింపు కొనసాగుతోంది. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖలకు చెందిన 190 మంది సభ్యుల బృందం.. వరదలు చోటు చేసుకున్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. ఇందులో భాగంగా చలియార్ నది, దాని పరివాహక ప్రాంతాలు, సమీప అడవులపై దృష్టిసారించినట్లు ఏడీజీపీ ఎం ఆర్ అజిత్ కుమార్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను ఇప్పటికే ఒకసారి గాలించామని, తాజాగా నది, దాని తీర ప్రాంతాలపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. ఎగువ సాయి 48 మొతం పూరికాగా ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు.అయితే, నీటి స్థాయిలు తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. భారీ వర్షం కారణంగా సెర్చ్ ఆపరేషన్కు అంతరాయం కలుగుతోందన్నాయి. అయితే, సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది.



# రూ.33వేలు డిమాండ్ చేస్తున్నారు

- నామొబైల్, వాట్సాప్ చేసిన హ్యాకర్లు
- ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే

**పుణె:** తన మొబైల్ ఫోన్, వాట్సాప్ హ్యాక్ చేసిన హ్యాకర్లు రూ.33,000 డిమాండ్ చేస్తున్నారని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే వెల్లడించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అదితి నలవాడేకు చెందిన వాట్సాప్ ఖాతా కూడా హ్యాక్ చేసి, ఆమె నుంచి రూ.10వేలు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. హ్యాకర్ల గురించి తెలుసుకోవడానికి డబ్బు చెల్లించడానికి ఒప్పుకున్నామని వారు బ్యాంకు అకౌంట్ల వివరాలు తమకు పంపారని వెల్లడించారు. హ్యాకింగ్ విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, హ్యాకర్లు పంపిన బ్యాంక్ అకౌంట్ వివరాలు వారికి అందజేస్తామన్నారు. కాగా తన ఫోన్ హ్యాక్ అయ్యిందని ఎవరూ మెసేజ్ లేదా ఫోన్ చేయొద్దని ఆమె విజ్ఞప్తిచేసిన విషయం తెలిసిందే. తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నానని.. అందరూ గమనించాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసు అందింది..**

బడ్జెట్ సెషన్ తర్వాత తనకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందాయని సుప్రియా సూలే వెల్లడించారు. "పార్లమెంటులో నేను మాట్లాడిన ప్రతిసారీ, అదే సమయంలో ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు ఎందుకు వస్తున్నాయో మాకు అర్థం కాదు" అని అన్నారు. సుప్రియా సూలే కేంద్ర మాజీ మంత్రి, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్ కుమార్తె. ప్రస్తుతం ఎన్సీపీ (ఎస్పీ) కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ఉన్నారు. బారామతి నుంచి లోక్సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# హిండెన్‌బర్గ్ కుట్రకు కాంగ్రెస్ వత్తాసు

**బీజేపీ నేత గౌరవ్ వల్లభ్**




**ఢిల్లీ:** హిండెన్‌బర్గ్ లేటెస్ట్ రిపోర్ట్ రాజకీయ ప్రకంపనలకు కేంద్రబిందువైంది. ఈ రిపోర్ట్ వెల్లడించిన అంశాలపై కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలకు పదునుపెట్టాయి. అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్‌తో పాటు ఆమె భర్తకు వాటాలున్నాయని ఈ నివేదిక పేర్కొనడం పెను దుమారం రేపింది. సెబీ చీఫ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తుండగా ఇవి నిరాధార ఆరోపణలని పాలక పక్షం దీటుగా బదులిస్తోంది. భారత మార్కెట్లు పతనం కావాలని కాంగ్రెస్, హిండెన్‌బర్గ్ కోరుకుంటున్నాయని బీజేపీ నేత గౌరవ్ వల్లభ్ ఆరోపించారు. విపక్షాలు, హిండెన్‌బర్గ్ ఆశలు ఫలించవని, దేశీయ స్టాక్‌మార్కెట్లు, కంపెనీలు పటిష్టంగా ఉన్నాయని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికపై ఎంత గగ్గోలు పెట్టినా మార్కెట్ కేవలం 0.7 శాతమే పడిపోయిందని చెప్పారు. ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్, రాహుల్ గాంధీ దేశ ఆర్థిక వృద్ధినీ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ ఏం ఒప్పందం చేసుకుందో బయటపెట్టాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చిన కొద్దిక్షణాల్లోనే కాంగ్రెస్ నేతలు ట్వీట్లు చేయడం ఎందుకు మొదలుపెట్టారని ప్రశ్నించారు. అదానీ షేర్లను షార్ట్ సెల్లింగ్ చేయడం ద్వారా రూ. 122 కోట్లు ఆర్జించినందుకు హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్ నోటీస్ జారీ చేస్తే సమాధానం ఇచ్చేందుకు భయపడుతోందని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి మధ్యతరగతి కలలను చిదిమేసే కుట్రకు తెరలేపారని ఆరోపించారు. సెబీ షోకాజ్ నోటీసుకు సమాధానం చెప్పకుండా మరో రీసెర్చి రిపోర్ట్‌ను రిలీజ్ చేశారని చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే హిండెన్‌బర్గ్ కుట్రకు కాంగ్రెస్ మద్దతిస్తోందని విమర్శించారు.

# రాహుల్ గాంధీ ప్రమాదకరమైన వ్యక్తి

- అతడు ప్రధాని కాలేదనే నిరాశలో ఉన్నారు
- దేశ భద్రత, ఆర్థిక పరిస్థితిని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు.
- ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉండిపోతారు
- కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు



**ఢిల్లీ:** సెబీ చైర్ పర్సన్ మాధవి పురి బచ్ పై హిండెన్ బర్గ్ వెల్లడించిన నివేదిక దేశ రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ అంశంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ అత్యంత ప్రమాదకరమైన, విషపూరిత, విధ్వంసకర వ్యక్తి అని ఆరోపించారు.అతడు ప్రధాని కాలేదనే నిరాశలో దేశ భద్రత, ఆర్థిక పరిస్థితిని అస్థిరపరచడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ప్రధాన మంత్రి కాకపోతే ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయడమే ఆయన ఎజెండా అని ఆరోపించారు. ఎక్స్ ట్విట్టర్లో సోమవారం ఓ పోస్ట్ చేసిన ఆమె.. హిండెన్ బర్గ్ రిపోర్ట్ ఆధారంగా స్టార్ మార్కెట్ గురించి రాహుల్ గాంధీ అసంతృప్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు.రాహుల్ ఎప్పటికీ ప్రతిపక్షంలోనే ఉండిపోతారు" అంటూ కంగన ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాహుల్ గాంధీ.. మీరు జీవితాంతం ప్రతిపక్షంలోనే కూర్చొడానికి సిద్ధంగా ఉండండి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ తమ నాయకుడిగా ఎంచుకోరు అని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. భారతీయ స్టాక్ మార్కెట్ క్రాష్ అవ్వాలని, ఎకానమీని ధ్వంసం చేయాలని కాంగ్రెస్ కోరుకుంటుందని దుయ్యబట్టారు. కాగా హిండెన్ బర్గ్ నివేదికపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'సెబీ' పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. 'చైర్ పర్సన్ పై వచ్చిన ఆరోపణలతో సెబీ పవిత్రత మసకబారింది. దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు వేస్తున్నారు. సెబీ చైర్పర్సన్ మాధవీ పురి ఇంకా ఎందుకు రాజీనామా చేయలేదు? ఒకవేళ ఇన్వెస్టర్లు తాము కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతే.. ఎవరు జవాబుదారీగా ఉంటారు? ప్రధాని మోదీనా? సెబీ చైర్ పర్సనా? లేదా అదానీనా? ఈ అంశాన్ని సుప్రీంకోర్టు మరోసారి సుమోటోగా పరిశీలిస్తుందా?"అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. దీనివల్ల భారతీయ స్టాక్ మార్కెట్లో గణనీయమైన ప్రమాదం పొంచి ఉందనే విషయం ప్రజల దృష్టికి తీసుకురావడం లోక్ సభా ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.

# మహిళా వైద్యురాలిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి

**విశ్వంభర, బషీర్ బాగ్:** కలకత్తాలో మహిళా వైద్యురాలిని డ్యూటీలో ఉండగానె కిరాతకంగా హతమార్చిన ఘటన మానవ సమాజానికి సిగ్గు చేటు అని, ఇంతటి ఘోరానికి పాల్పడిన నేరగాళ్లకు కఠినంగా శిక్షించాలని డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు, తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ డాక్టర్ లక్ష నాయుడు డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఆగస్టు 9న ఆర్‌జీ కర్ర్ మెడికల్ కాలేజీ కొలకత్తాలోని ఛాతీ వైద్య విభాగంలో, సెమినార్ రూమ్‌లో జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు జరగడానికి పని ప్రదేశాల్లో పటిష్టమైన భద్రత లేకపోవడమే కారణం అన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆసుపత్రి యాజమాన్యం మహిళా వైద్యురాలికి కుటుంబానికి పరిహారం అందించాలన్నారు. ప్రాణాలు కాపాడే డాక్టర్ల కే భద్రత లేక పోతే మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉంటుందని, మహిళల భద్రతకు సంబంధించిన ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, తగు చర్యలు తీసుకుని మహిళలకు భద్రత కల్పించాలని డాక్టర్ లక్ష నాయుడు కోరారు.


# ఏపీ రైతులకు అదిరిపోయే శుభవార్తలు

- వచ్చే ఖరీఫ్ నుంచి 48 గంటల్లోనే నగదు జమ
- మంత్రి నాదెండ్ల మనోహర్



**విశ్వంభర, అమరావతి :** వచ్చే ఖరీఫ్ నుంచి 48 గంటల్లోనే ధాన్యం డబ్బులను జమ చేస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో రైతులకు ధాన్యం బకాయిల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందిరిపైనా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా చాలా వెనుకబడిందని, రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్ల ధాన్య బకాయిలు పెట్టిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని విడుదల చేయాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. కష్టకాలంలో ఉన్నప్పటికీ గత నెలలో రూ.వెయ్యి కోట్లు విడుదల చేశామని, ప్రస్తుతం మిగతా రూ.674 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 35,374 మంది రైతుల ఖాతాల్లో రూ.472 కోట్లు వేస్తున్నామని మంత్రి చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని, నష్టపోయిన కౌలు రైతులను ఆదుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమాత్రం వెనుకాడబోమని, చివరి గింజ వరకూ కొంటామని మంత్రి వెల్లడించారు.

# సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష



**విశ్వంభర, అమరావతి :** అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో తన మార్కు చూపిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అలాగే 2014 ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన అనేక కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబు నాయుడు మరో పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఆరోగ్యశాఖ మీద సీఎం సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖలో 2014–19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వైసీపీ విధానాలతో ప్రభుత్వాసుపత్రులంటే ప్రజల్లో నమ్మకం పోయిందన్న చంద్రబాబు.. ప్రజల్లో తిరిగి నమ్మకాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.మరోవైపు ఎన్టీఆర్ బేబీ కిట్లను తల్లులకు అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శిశువులకు అవసరమైన సామాగ్రిని కిట్స్ ద్వారా పంపిణీ చేయాలన్నారు.గతంలో 2016లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీని ప్రారంభించింది. ప్రసవం తర్వాత శిశువులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు గానూ ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ కిట్‌లో నవజాతి శిశువులకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచారు. చిన్న పరుపు, చేతులు శుభ్రం చేసుకునే లిక్విడ్, బేబీ సబ్బు, పౌడర్, దోమతెర గొడుగు, న్యాప్‌కిన్లను కిట్ల రూపంలో బాలింతలు అందజేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం కొన్నాళ్లపాటు ఈ పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత సరిగ్గా అమలు కాలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను తిరిగి పంపిణీ చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం తరపున యాప్ రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి సంబంధించిన వివరాలు పొందుపరచాలని చంద్రబాబు సూచించారు. ఆస్పత్రిలో రోగికి అందించే వైద్య సేవలు, పరికరాలు, ఇచ్చే మందుల వివరాలను కూడా యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. ఇక రాష్ట్రంలో కిడ్నీ బాధితులు ఎంతమంది ఉన్నారనే దానిపై మండలాల వారీగా వివరాలు సేకరించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. సీటీ స్కాన్ సర్వీసెస్‌ను అన్ని జిల్లా ఆస్పత్రులలో ఏర్పాటు చేయాలని.. రాష్ట్రంలో టీబీ రోగులు ఎంతమంది ఉన్నారనే దానిపై అధ్యయనం చేసి వారికి మందులు అందించాలని ఆదేశించారు. ఫీడర్ అంబులెన్సుకు సాధారణ అంబులెన్సుకు మధ్య అనుసంధానం పెంచాలన్న చంద్రబాబు.. డోలీ మోతలు ఇంకా కనబడుతున్నాయన్నారు. డోలీ మోతలు మళ్లీ రిపీట్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లగలిగినప్పటికీ సాధ్యం కాదని నిర్లక్ష్యం వహిస్తే... నేరుగా తానే ప్రాంతాన్ని సందర్శిస్తానని చంద్రబాబు చెప్పారు. ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన బెడ్ షీట్లు అందించాలని స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గం స్థాయిలో పీపీపీ విధానంలో ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని సీఎం.. ప్రభుత్వమే స్థలం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వ, పీపీపీ ఆసుపత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తామని చెప్పారు. దేశంలోనే ఏపీ ఆసుపత్రుల పనితీరు బెస్ట్‌గా ఉండేలా పనిచేయాలని అధికారులకు సూచించారు.

# పెద్దిరెడ్డి బాధితులు వేలల్లో ఉన్నారు

## మంత్రి అనగాని సత్యప్రసాద్



**విశ్వంభర, తిరుపతి :** వైసీపీ హయాంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం పెద్దెత్తున భూకబ్జాలకు పాల్పడ్డారు.. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దిరెడ్డి బాధితులు ఉన్నారు. తప్పుచేసి తప్పించుకోవడం సాధ్యం కాదని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ లు తిరుపతి జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడారు. మదనపల్లె ఫైళ్ళ దగ్ధం కేసు విచారణ వేగంగా జరుగుతోందని చెప్పారు. పెద్దిరెడ్డి అనుచరుల ఇళ్ళలో భూములకు సంబంధించిన వందల ఫైళ్ళు దొరికాయి. మదనపల్లె ఫైళ్ళ దగ్ధం కేసులో ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం వందల ఎకరాల భూకబ్జాలకు పాల్పడినట్లు ఆధారాలున్నాయని మంత్రి పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు, రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బాధితులు ఉన్నారని, వైసీపీ హయాం లో జరిగిన అన్ని కుంభకోణాలను బయటపెడతామని అన్నారు. ప్రజా ధనాన్ని వైసీపీ నేతలు దోచుకున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. 24గంటల పాటు వినియోగదారులకు విద్యుత్ ను అందిస్తామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తామని, ఒక్క మెగా వాట్ కూడా కొత్త విద్యుత్ ఉత్పత్తిని తీసుకురాలేదని చెప్పారు. కొత్త విద్యుత్ ఉత్పత్తి తీసుకురాక పోవడంవల్ల గతంలో విద్యుత్ చార్జీల ధరలు పెరిగాయి. 6 నుంచి 7శాతం విద్యుత్ వాడకం పెరుగుతోంది. విద్యుత్ ఛార్జీలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి చెప్పారు. నూతన విద్యుత్ ప్లాంట్లు, సోలార్ విద్యుత్, రైతులకు కుసుమ్ యోజన పథకాన్ని ఏ విధంగా అందించాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సీఐడీ విచారణ

**విశ్వంభర, అమరావతి :** టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై మరింత లోతుగా ప్రభుత్వం విచారణ చేపట్టనుంది. ఈ అంశాన్ని మంత్రి నారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సీఐడీ విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. సీఐడీ విచారణకు ఇస్తేనే అసలు సూత్రధారులు ఎవరన్న అంశం వెలుగులోకి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరిపై ఆరోపణలు ఉన్నాయి. తణుకు టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిన తీరును మంత్రి నారాయణ సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ వ్యవహారం కోర్టులో ఉండటంతో ప్రభుత్వం న్యాయనిపుణులతో సంప్రదింపులు చేస్తుంది. తణుకు మున్సిపాలిటీలో 754 కోట్ల రూపాయల మేర బాండ్లు జారీ చేసినట్టు పురపాలక శాఖ, అవినీతి నిరోధక శాఖలు గుర్తించాయి. మొత్తం 691 కోట్ల రూపాయల మేర అక్రమాలు జరిగినట్టు ఏసీబీ గుర్తించింది. బాండ్ల జారీకి అనుసరించిన విధానంపై ప్రభుత్వ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. స్థల సేకరణ సమయంలో ఎకరాల్లో గుర్తించి బాండ్ల జారీకి చదరపు గజాల్లో స్థలం లెక్కించినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఎకరా 55 లక్షలకు సేకరించి బాండ్ల జారీకి ఎకరా 10 కోట్లు విలువ చూపడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్ సహా ముగ్గుర్ని సస్పెండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2019–24 మధ్య కాలంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై ప్రభుత్వం అంతర్గత విచారణ చేస్తుంది. మరోవైపు టీడీపీ బాండ్లపై త్వరలోనే కొత్త మార్గదర్శకాలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పలు రాష్ట్రాల్లో అధికారుల బృందం అధ్యయనం చేస్తోంది. వైఎస్సార్సీపీ పాలనలో టీడీపీ బాండ్ల జారీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. వైఎస్సార్సీపీ నేతలపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అందుకే బాండ్ల జారీలో అవినీతికి ఆస్కారం లేని ఉత్తమ విధానాలపై దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ, హరియాణాలలో అధికారులు పర్యటించి అధ్యయనం చేస్తున్నారు.



సెక్యూరిటీ లేకపోతే జనం దాడి చేస్తారని

# జగన్‌కు భయం

## మంత్రి అనిత

**విశ్వంభర, రాజమండ్రి :** వైసీపీ చీఫ్ జగన్ సెక్యూరిటీని తగ్గించలేదని, భద్రత తగ్గించారంటూ ఆయన అనవసర రాద్ధాంతం చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సెక్యూరిటీ లేకపోతే ప్రజలు దాడి చేస్తారనే భయంతోనే ఆయన అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 20వేల మంది పోలీసుల కొరత ఉంటే ఆయనకు 900 మంది సెక్యూరిటీ కావాలా అని మండిపడ్డారు. రాజమండ్రి సెంట్రల్ జైలును హోంమంత్రి అనిత సోమవారం పరిశీలించారు. జైలు ఆధ్వర్యంలో పెట్రోలు బంక్‌ను ప్రారంభించిన అనంతరం.. సెంట్రల్ జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్నేహ బ్లాక్ వద్దకు వెళ్లాక హోం మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును జైలుకు పంపించడాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకున్నారు. తమ నాయకుడిని 53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజులు గుర్తుకువచ్చి బాధగా అనిపిస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులకు చంద్రబాబు కూడా బాధితుడిగా మారారని పేర్కొన్నారు. అక్రమ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పాతాళానికి పడిపోయాయని తెలిపారు. వాళ్ల పాపాలు పండాయని.. అందుకే జన నాయకుడిని బాధపెట్టిన వైసీపీని పాతాళానికి తొక్కేలా ప్రజలు బలమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు.



# ఆగస్టు 15న అన్న క్యాంటిన్లు రీఓపెన్

**విశ్వంభర, అమరావతి :** 2024 ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీలలో అన్న క్యాంటీన్లు ఒకటి కాగా ఈ హామీ అమలు దిశగా అడుగులు పడనున్నాయని తెలుస్తోంది. అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఇండిపెండెన్స్ డే రోజున అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. తొలి విడతలో 100 క్యాంటీన్లను అందుబాటులోకి తెస్తామని నారాయణ అన్నారు. ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు కృష్ణా జిల్లా ఉయ్యూరులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. ఈ నెల 16వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు మిగతా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తారని ఆయన చెప్పుకొచ్చారు. మంత్రి నారాయణ చేసిన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. 2024 ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన అద్భుతమైన హామీలలో అన్న క్యాంటీన్లు ఒకటి కాగా ఈ హామీ అమలు దిశగా అడుగులు పడనున్నాయని తెలుస్తోంది. అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఇండిపెండెన్స్ డే రోజున అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. రాష్ట్రంలో 33 మున్సిపాలిటీలలో ఈ అన్న క్యాంటీన్లు మొదలుకానున్నాయని తెలుస్తోంది. హరే రామ హరే కృష్ణ సంస్థ అన్న క్యాంటీన్ల నిర్వహణను చూసుకోనుంది. తక్కువ ధరకే మూడు పూటలా పేదలకు మంచి ఆహారం అందించాలనే మంచి ఉద్దేశంతో అన్న క్యాంటీన్ల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని సమాచారం అందుతోంది. రోజువారీ కూలీలు, కార్మికులకు ఈ క్యాంటీన్ల ద్వారా మేలు జరగనుంది. రాబోయే రోజుల్లో మరో 83 క్యాంటీన్లను సైతం అందుబాటులోకి తీసుకురానున్నారు. కొన్నిచోట్ల కొత్తగా అన్న క్యాంటీన్ల నిర్మాణం జరుగుతోంది. అందువల్ల కొన్ని ప్రాంతాలలో అన్న క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులోకి రావడానికి మరింత సమయం పట్టనుంది. అన్న క్యాంటీన్లలో అందించే ఆహారం, ధరలకు సంబంధించి పూర్తిస్థాయిలో స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందేనని చెప్పవచ్చు. ప్రస్తుత కాలంలో 5 రూపాయలకు టీ కూడా కొనుగోలు చేయలేమనే సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో 5 రూపాయలకే భోజనం అందు బాటులోకి వస్తే మాత్రం ప్రజలకు ప్రయోజనకరం గా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

# విక్రం సారాభాయ్ జీవితం స్ఫూర్తిదాయకం

## పవన్‌కల్యాణ్




**విశ్వంభర, అమరావతి :** ప్రముఖ శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ జయంతి సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఇవాళ మన దేశం అంతరిక్ష పరిశోధన, అనుబంధ రంగాల్లో గణనీయ విజయాలు సాధిస్తోందంటే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ఈ రంగంలో విశిష్ట సేవలు అందించిన శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ దూరదృష్టే కారణమని పేర్కొన్నారు. ఒక శాస్త్రవేత్త దేశం గురించి, తన చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచన చేస్తే ఎంత గొప్ప ఫలితాలు వస్తాయో దివంగత విక్రమ్ సారాభాయ్ జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుందని పవన్ కల్యాణ్ వివరించారు. ఫిజిక్స్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు, భారత్ కు శాటిలైట్ ఉండాల్సిన ఆవశ్యకతను నాటి ప్రధాని నెహ్రూకు వివరించడం, ఆయనను ఒప్పించడం, ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడం ద్వారా భారతదేశ అంతరిక్ష అభివృద్ధికి విక్రమ్ సారాభాయ్ నాంది పలికారని తెలిపారు. ఇవాళ ఆ మహనీయుడి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశం అంతర్జాతీయంగా అర్థవంతమైన పాత్ర పోషించాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని సామాజిక సమస్యల పరిష్కారినికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని విక్రమ్ సారాభాయ్ చెప్పిన మాటలను ఇప్పటితరం శాస్త్రవేత్తలు ఆచరించి చూపాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సారాభాయ్ అందించిన స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా సమాజానికి మేలు కలిగించే మరిన్ని పరిశోధనలు ఆవిష్కృతం కావాలని ఆకాంక్షించారు.



# ఏపీలో క్వార్టర్ మద్యం బాటిల్ దర రూ.80?

**విశ్వంభర, అమరావతి :** గతంలో అస్తవ్యస్త మద్యం విధానం అమల్లో ఉండడంతో ఆంధ్రప్రదేశ్ మందుబాబులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మరి మద్యం సేవించే వారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో మద్యం విధానంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. త్వరలోనే కొత్త మద్యం విధానం తీసుకురానున్నారు. ఆ మద్యం విధానం ద్వారా అతి తక్కువ ధరకే మద్యం అందుబాటులోకి రానుందని సమాచారం. బిర్యానీ కన్నా తక్కువ ధరకే మద్యం లభిస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో క్వార్టర్ సీసా కేవలం రూ. 80 నుంచి 90 లోపే ధర నిర్ణయించాలని ఏపీ ఎక్సైజ్ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. ఇకపై ఏపీ మందు బాబులు పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

# రవి డెంటల్ ప్రారంభం



**విశ్వంభర, వనస్థలిపురం :** రవి డెంటల్ హాస్పిటల్ హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులుగా గుత్తా సుఖేందర్‌రెడ్డి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, కల్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. నల్లగొండ జిల్లా పరిసర ప్రాంతాల నుంచి లోకల్ హైదరాబాద్ వాసులకు అందుబాటులో ఉండే విధంగా అధునాతనమైన డెంటల్ పరీక్షలను అందిస్తున్న తిరుదాస్ రవి కిరణ్‌కు కంగ్రాట్యులేషన్స్ తెలియజేశారు. డాక్టర్ తీరమ్ దాస్ రవి కిరణ్ మాట్లాడుతూ.. మానవులకు పండ్లు అతి ముఖ్యమైనవని అవి సక్రమంగా ఉంటేనే ఆయురారోగ్యంగా ఉండగలుగుతామన్నారు. తమ వద్ద అన్ని డెంటల్ సమస్యలకు అధునాత పద్దతిలో చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.స్వాతి తదితరులు పాల్గొన్నారు.


# హెచ్‌సీఏ ఉమెన్స్ టీ10 లీగ్ షురూ

- మిథాలీ వంటి మేటి క్రికెటర్లను తయారు చేస్తాం
- టీమిండియా, డబ్ల్యూపీఎల్‌కు తెలంగాణ ఆడబిడ్డలను ఆడించడమే లక్ష్యం
- హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) చరిత్రలో తొలిసారిగా మహిళా క్రికెటర్ల కోసం ఉమెన్స్ టీ10 లీగ్‌ను ప్రారంభించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఉమెన్స్ లీగ్ ప్రారంభోత్సవంలో జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ.. అండర్-15లో 12 జట్లు, అండర్-17లో 12 జట్లు, అండర్-19లో ఆరు జట్లు పోటీ పడనున్నాయని చెప్పారు. 15 రోజుల పాటు జరగనున్న ఈ లీగ్‌లో సుమారు 450 మంది మహిళా క్రికెటర్లు ఆడనున్నారని చెప్పారు. మ్యాచ్‌లన్నీ హైదరాబాద్ కేంద్రంగానే జరగనున్నాయని, అయితే ప్రతి జట్టు ఒక్క మ్యాచ్ అయినా ఉప్పల్‌లో ఆడేలా షెడ్యూల్ రూపొందించామని అన్నారు. భారత జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ వంటి మేటి క్రికెటర్లను తయారు చేయాలనే ఆశయంతో ఈ లీగ్‌కు రూపకల్పన చేశామన్నారు. భవిష్యత్‌లో టీమిండియా, డబ్ల్యూపీఎల్‌కు తెలంగాణ ఆడబిడ్డలను ఆడించడమే తమ లక్ష్యమని తెలిపారు. అలానే తన సహచర అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో చర్చించి, అన్ని సదుపాయాలున్న మహిళ క్రికెట్ అకాడమీ కూడా స్థాపించేందుకు కృషి చేస్తానని జగన్‌మోహన్ రావు చెప్పారు.

# బరువు కొలిచే నియమాల్లో మార్పులు



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫైనల్కు చేరిన తర్వాత 100 గ్రాముల అదనపు బరువు ఉందని ఆమెపై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఇతర దేశాల రెజ్లర్లు సైతం వ్యతిరేకించారు. ఈ క్రమంలో ప్రపంచ రెజ్లింగ్ గవర్నింగ్ బాడీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక నుంచి రెజ్లర్ల బరువు కొలిచే నియమ నిబంధనల్లో మార్పులు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ మార్పులు పూర్తిస్థాయిలో కాకుండా అథ్లెట్ల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని స్వల్ప మార్పులు చేస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మార్పులను త్వరలోనే అమల్లోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 50 కేజీల విభాగంలో పోటీపడి 100 గ్రాముల అదనపు బరువుతో అనర్హతకు గురైె వినేశ్ ఫొగాట్ న్యాయపోరాటం చేస్తోంది. అనర్హతను సవాలు చేస్తూ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏటఎస్)ను ఆశ్రయించింది. ఆమె అప్పీల్ను విచారణకు స్వీకరించిన కాస్ మంగళవారం (ఆగస్టు 13న) సాయంత్రం ఆరు గంటల్లోగా తుది తీర్పును వెల్లడించనుంది.

# ఆరు పతకాలతో ముగిసిన భారత్ ప్రస్థానం

## త్రుటిలో చేజారినవి ఎన్నో..



**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు ఆదివారంతో ఎండ్ కార్డ్ పడనుంది. ఈ విశ్వ క్రీడల్లో భారత్ పోరాటం కూడా ముగిసింది. అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరఫున 117 మంది అథ్లెట్లు ఆయా క్రీడాంశాల్లో బరిలో దిగి తమతమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అయితే ఈసారి పతకాల సంఖ్య గతంలో (2020లో 7 పతకాలు) కంటే పెరుగుతుందని భావించగా, భారత్ ఆరింటితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇందులో ఐదు కాంస్యాలు, ఒక రజత పతకాలున్నాయి. అయితే పతకాల సంఖ్య అటుంచితే ఒలింపిక్స్‌లో మనోళ్లు పలు కొత్త రికార్డులు నెలకొల్పి చరిత్ర సృష్టించారు. అవేంటంటే?

### షూటర్ మను బాకర్ రెండు కాంస్య పతకాలు

ఈ ఒలింపిక్స్‌లో షూటర్ మను బాకర్ రెండు కాంస్య పతకాలు సాధించింది. తొలుత షూటింగ్ 10మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మను కాంస్య పతకం దక్కించుకుంది. దీంతో ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సరబ్‌జ్యోత్‌తో కలిసి కాంస్యం సాధించిన మను స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచింది.

**హాకీలో..** టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టు ఈ సారి కూడా కాంస్యం అందుకుంది. దీంతో విశ్వక్రీడల్లో హాకీలో భారత్ పతకాల సంఖ్య 13కి చేరింది. భారత జట్టు 52 ఏళ్ల తర్వాత వరుసగా కాంస్య పతకాలు సాధించడం ఇదే తొలిసారి. అంతకు ముందు 1968, 1972లో టీమ్‌ఇండియా మూడో స్థానంలో నిలిచింది.

### మరోసారి నీరజ్

టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ సారి రజతం దక్కించుకున్నాడు. దీంతో ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌లో వరుసగా రెండు పతకాలు సాధించిన క్రీడాకారుడిగా నీరజ్ రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా వరుసగా రెండు ఒలింపిక్ ఎడిషన్లలో పతకం సాధించిన మూడో భారత అథ్లెట్‌గా నిలిచాడు. అతని కంటే ముందు రెజ్లర్ సుశీల్ కుమార్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఘనత సాధించారు.

### ఒకే ఈవెంట్‌లో మూడు పతకాలు

షూటర్ స్వప్నిల్ కుశాలె 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ఈ విభాగంలో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి. దీంతో షూటింగ్‌లోనే భారత్ మూడు పతకాలు నెగ్గింది. ఒక ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో మూడు పతకాలు అందుకోవడం ఇదే తొలిసారి.

### చివర్లో అమన్

ఈ ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంలో పోటీ పడిన ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్. తిరుగులేని ఆటతో ఆశలు రేపినా అతడు సెమీస్‌లో భంగపడ్డాడు. చివరకు కాంస్య పతకం సాధించి రెజ్లింగ్‌లో ఈ సారి భారత్‌కు పతకాన్ని అందించాడు. ఒలింపిక్స్‌లో వ్యక్తిగత పతకం గెలిచిన అతి పిన్న వయస్సు (21 ఏళ్ల 24 రోజులు) భారత అథ్లెట్‌గా అతను చరిత్ర సృష్టించాడు. పీవీ సింధు (2016లో రజతం గెలిచినప్పుడు 21 ఏళ్ల 1 నెల 14 రోజులు) నెలకొల్పిన రికార్డును బ్రేక్ చేశాడు.


### చేజారిన పతకాలు..

10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ బబుతా కనీసం రజత పతకం సాధిస్తాడని అంతా భావించారు. కొద్దిలో నాలుగో స్థానానికి పడిపోయి కాంస్య పతకాన్ని మిస్ చేసుకున్నాడు. మను బాకర్ కూడా 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో ప్లేస్‌లో నిలిచి త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జిత్ సింగ్ ఒక్క పాయింట్‌తో కాంస్య పతకానికి దూరమయ్యారు. ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బొమ్మదేవర ధీరజ్, అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన మీరాబాయి చాను ఈ సారి నిరాశపర్చింది. నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని చేజార్చుకుంది.

# దేశవాళీ క్రికెట్ ఆడనున్న రోహిత్, కోహ్లీ



**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత దేశవాళీ టోర్నీలో బరిలోకి దిగనున్నట్లు సమాచారం. వీళ్లిద్దరూ 2024 దులీప్ ట్రోఫీలో ఆడబోతున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దులీప్ ట్రోఫీలో ఆడాలని నిర్ణయించుకున్నారని వార్తలు వస్తున్నాయి. దులీప్ ట్రోఫీ టోర్నీసెప్టెంబర్ 5న ప్రారంభం కానుంది. టోర్నీలో ఒక రౌండ్ బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియంలో నిర్వహించనున్నారు. అయితే, దులీప్ ట్రోఫీ ఏపీలోని అనంతపురంలో జరగాల్సి ఉంది. అయితే అనంతపురానికి ఎయిర్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల స్టార్ క్రికెటర్లు రావడం అనుమానంగా మారింది. దీంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఒక రౌండ్ దులీప్ ట్రోఫీని నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తోంది. ఈ దశలోనే రోహిత్, విరాట్ పాల్గొననున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే రోహిత్ శర్మ దాదాపు 9 ఏళ్ల తర్వాత డొమెస్టిక్ టోర్నీలో రీ ఎంట్రీ ఇస్తాడు. ఇక మిగిలిన ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్‌ను దులీప్ ట్రోఫీలో ఆడాలని కోరినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అలాగే 2023 వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడిన స్టార్ పేసర్ మహ్మద్ షమీ ప్రస్తుతం పూర్తిగా కోలుకోవడంతో అతడిని కూడా ఈ టోర్నీలో బరిలోకి దింపాలని బోర్డు భావిస్తోంది. కానీ, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు మాత్రం ఈ టోర్నీ నుంచి మినహాయింపు ఉన్నట్లు సమాచారం. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్యానెల్ టోర్నమెంట్ కోసం నాలుగు స్క్వాడ్‌లు- ఇండియా ఏ, ఇండియా బీ, ఇండియా సీ, ఇండియా డీలను ఎంపిక చేయనుంది. పాత జోనల్ ఫార్మాట్ ప్రకారం అయితే... సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ మొత్తం 5 జోన్స్ వారీగా టోర్నీ జరిగేది. ఆయా జోన్లకు సంబంధించిన క్రికెటర్లు తమతమ జోన్ల తరఫున బరిలో దిగేవారు. ఇక ఈసారి ఈ టోర్నీ సెప్టెంబర్ 5 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. అయితే బంగ్లాతో టీమిండియా టెస్టు సిరీస్ సెప్టెంబర్ 19న ప్రారంభం కానుంది. అంటే రోహిత్, విరాట్సహా స్టార్ ప్లేయర్లు దులీప్ ట్రోఫీ టోర్నీ ఆసాంతం ఆడకపోవచ్చు. అలాగే చెన్నైలో టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు బోర్డు స్వల్పకాలిక క్యాంప్‌ను కూడా ప్లాన్ చేస్తోంది.




# హిండెన్ బర్గ్ ఆరోపణలు..

## నష్టాల్లో అదానీ గ్రూప్ స్టాక్స్

**విశ్వంభర, బిజినెస్ :** అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు మరోసారి అదానీ గ్రూప్ స్టాక్స్ ను కుదిపేశాయి. ఈసారి అదానీ గ్రూప్ సంస్థలను నేరుగా లక్ష్యంగా చేసుకోనప్పటికీ.. గతంలో చేసిన ఆరోపణలకు కొనసాగింపుగా ఈసారి సెబీ చీఫ్ను ఈ వ్యవహారంలోకి లాగడం గమనార్హం. దీంతో అదానీ గ్రూప్ స్టాక్స్ పై మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో ఆ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అదానీ గ్రూప్ నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ ఉదయం బీఎస్ఈలో ఏకంగా 17 శాతం మేర నష్టపోయింది. అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం చొప్పున నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ ఎంటర్ ప్రైజెస్ 5.43 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్ 2.53 శాతం, ఏసీసీ 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, తర్వాత కాస్త కోలుకున్నాయి. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలోని కొన్ని బెర్ముడా, మారిషస్ ఫండ్లలో సెబీ చీఫ్ మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్లు 2015లో పెట్టుబడులు పెట్టారు. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని హిండెన్బర్గ్ ఆరోపించింది. 2017లో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా మాధబి నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ ఛైర్పర్సన్గా పదోన్నతి పొందారు. తమకు వాటాలున్న విదేశీ సంస్థలు కనుకే, అదానీ గ్రూప్పై సెబీ విచారణ తూతూమంత్రంగా జరిగేలా చేశారన్నది హిండెన్బర్గ్ తాజా ఆరోపణ. దీన్ని సెబీ చీఫ్ తో పాటు అదానీ గ్రూప్ కూడా ఖండించింది.


# హోమ్ లోన్‌పై ప్రముఖ బ్యాంకుల వడ్డీ రేట్లు




**విశ్వంభర, బిజినెస్ :** కొత్త ఇల్లు కొనడం లేదా నిర్మించుకోవడం అనేది అంత ఈజీ కాదు. ఇందుకు చాలా డబ్బు అవసరం. దాచుకున్న డబ్బంతా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇంత భారీ మొత్తం ఖర్చు పెట్టలేని వారు హోమ్ లోన్ తీసుకోవచ్చు. అయితే వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇస్తున్న గృహ రుణాల వడ్డీ రేట్లు పోల్చి, తక్కువ లోన్ రేట్లను సెలక్ట్ చేసుకోవడం మంచిది. ఎందుకంటే అతి తక్కువ వడ్డీ రేటు తేడా కూడా లాంగ్ టర్మ్ ఫైనాన్షియల్ ప్లాన్‌ను దెబ్బతీయవచ్చు. ప్రస్తుతం మన దేశంలోని ప్రముఖ బ్యాంకుల హోమ్ లోన్ వడ్డీ రేట్లు ఏ రేంజ్‌లో ఉన్నాయో పరిశీలిద్దాం. %×జ×జ×% బ్యాంక్ : %×జ×జ×% బ్యాంక్, కస్టమర్ల క్రెడిట్ స్కోర్ ఆధారంగా స్పెషల్ హోమ్ లోన్ రేట్లు ఆఫర్ చేస్తుంది. క్రెడిట్ స్కోర్ 800 వరకు ఉండే ఉద్యోగస్తులు, స్వయం ఉపాధి పొందే వారికి వడ్డీ రేటు 9 శాతంగా ఉంది. క్రెడిట్ స్కోర్ 750-800 మధ్య ఉండే ఉద్యోగస్తులకు హోమ్ లోన్ రేటు 9 శాతం కాగా, స్వయం ఉపాధి పొందే వారికి ఇది 9.10 శాతంగా నిర్ణయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ : ఈ బ్యాంక్ ఇంటి నిర్మాణం, కొనుగోలు, రెనొవేషన్స్, ఎక్స్‌టెన్షన్ సహా వివిధ అవసరాల కోసం హోమ్ లోన్లు ఆఫర్ చేస్తుంది. %ూచీదీ% హౌసింగ్ కస్టమర్లకు 30 సంవత్సరాల టెన్యూర్ వరకు గృహ రుణాలను (ఖాతాదారులకు 70 సంవత్సరాల వయసు వచ్చే వరకు) అందిస్తుంది. %ూచీదీ% హౌసింగ్ ఇంటి విలువలో 90% వరకు లోన్ మంజూరు చేస్తుంది. ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంక్ హోమ్ లోన్ వడ్డీ రేటు 8.50% నుండి 11.45% వరకు ఉంది. ఖాతాదారుల క్రెడిట్ స్కోర్, జీతం ఆధారంగా లోన్ అమౌంట్, వడ్డీ రేటు మారుతుంది. బ్యాంక్ హోమ్ లోన్ వడ్డీ రేట్లు బ్యాంక్ ఫిక్స్‌డ్, ఫ్లోటింగ్ అనే రెండు రకాల హోమ్ లోన్లను అందిస్తుంది. వీటిపై వడ్డీ రేట్లు సంవత్సరానికి 8.60% నుంచి ప్రారంభమవుతాయి. ఈ రేట్లు గృహ రుణాలు, బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ లోన్లు, హౌస్ రెనొవేషన్ లోన్, హోమ్ ఎక్స్‌టెన్షన్ లోన్లకు వర్తిస్తాయి. బెంచ్‌మార్క్ పాలసీ రెపో రేట్ల ఆధారంగా బ్యాంకు వీటిపై వడ్డీని నిర్ణయిస్తుంది. ప్రస్తుతం రెపో రేటు 6.50 శాతంగా ఉంది. ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందే వారికి (ప్రొఫెషనల్ నాన్-ప్రొఫెషనల్స్) స్పెషల్ హోమ్ లోన్ రేటు ఫార్ములా.. పాలసీ రెపో రేటు ం 2.25% 3.15%. అంటే 8.75% నుంచి 9.65% వరకు హోమ్ లోన్ రేట్లు వర్తిస్తాయి. స్టాండర్డ్ హోమ్ లోన్ అయితే, వడ్డీ రేటు ఫార్ములా.. పాలసీ రెపో రేటు ం 2.90% 3.45% =% 9.40% నుంచి 9.95 శాతం వరకు ఉంటుంది.

### హోమ్ లోన్ వడ్డీ రేట్లు :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హోమ్ లోన్ కోసం మల్టిపుల్ ఆప్షన్స్ అందిస్తుంది. ఎస్బీఐ హౌసింగ్ లోన్ రేట్లు 8.50% నుండి 11.55% వరకు ఉన్నాయి. ఖాతాదారుల సిబిల్ స్కోర్ ఆధారంగా బ్యాంకు వడ్డీపై అంచనాకు వస్తుంది. ఎస్బీఐ రివర్స్ మార్టిగేజ్ లోన్లపై అత్యధికంగా 11.55 శాతం వడ్డీ విధిస్తోంది.





# ఎంగేజ్‌మెంట్ అయిన 9 ఏళ్లకు పెళ్లి చేసుకున్నా

**విశ్వంభర, సినిమా :** స్టార్ బ్యూటీ తాప్సీ పన్ను రీసెంట్‌గా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మతియాస్‌బో అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే పెళ్లి అనంతరం తన భర్త గురించి కానీ.. తన గురించి కానీ ఎక్కడ న్యూస్ రాలేదు. తాప్సీ కూడా అతడితో ఉన్న ఫొటోలను పోస్ట్ చేయలేదు. అయితే తన తాజా చిత్రం ఫిర్ ఆయీ హసీన్ దిల్రూబా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆగష్టు 09న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన రిలేషన్‌షిప్ గురించి అడుగగా.. తాప్సీ సమాధానమిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. తాప్సీ ఈ ఏడాది మార్చి 23న పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తన ఎంగేజ్‌మెంట్ మాత్రం 9 ఏళ్ల క్రితమే అయినట్లు ప్రకటించింది. మతియాస్ బో ను నేను 11 ఏళ్ల ముందు కలిశాను. 1 ఇయర్ వరకు డేటింగ్‌లో ఉన్న తర్వాత మతియాస్ నాకు ప్రపోజ్ చేశాడు. అప్పుడే మేము ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం అయితే ఇన్ని సంవత్సరాలు మేము విడిపోకుండా ఉన్నామంటే అది ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వల్లనే. అయితే మా ఫస్ట్ డేట్‌కి దుబాయ్ వెళ్లామని చెప్పుకోచ్చింది. ఇక తాప్సీ భర్త విషయానికి వస్తే.. మథియాస్ బో డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. ఇతడు 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో రజతం సాధించాడు. అలాగే 2015 యూరోపియన్ గేమ్స్‌లో బంగారు పతక విజేత, 2012 మరియు 2017లో రెండుసార్లు యూరోపియన్ ఛాంపియన్‌గా నిలిచాడు.



## NBK 109 సాలిడ్ అప్‌డేట్

**విశ్వంభర, సినిమా:** బాలకృష్ణ ప్రస్తుతం ఫుల్ ఫామ్ లో ఉన్న సంగతి తెలిసిందే. సినిమాల్లోబ్యాక్ టు బ్యాక్ హ్యాట్రిక్ కొట్టారు. రాజకీయాల్లో బ్యాక్ టు బ్యాక్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్‌తో బాలయ్య బాబు ఫుల్ స్వింగ్‌లో ఉన్నాడు. వరుస సినిమాలతో బిజీ బిజీ సమయాన్ని గడుపుతున్నాడు. గతేడాది భగవంత్ కేసరితో ప్రేక్షకుల మందుకు వచ్చి అదరగొట్టేశాడు. ఇందులో ఫుల్ మాస్ యాక్షన్ పాత్ర చేసి దుమ్ము దులిపేశాడు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లను సైతం రాబట్టింది. ఇక ఈ సినిమా తర్వాత ఇప్పుడు మరో పవర్ ఫుల్ సినిమా చేస్తున్నాడు. ఇది వరకు 'వాల్తేరు వీరయ్య'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు బాబీ డైరెక్షన్‌లో ఇప్పుడొక మూవీలో నటిస్తున్నాడు. ఈ చిత్రం 'NBK 109' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోంది. దర్శకుడు బాబీ ఈ చిత్రాన్ని ఎంతో గ్రాండ్ లెవల్లే తెరకెక్కిస్తున్నాడు. బాలయ్య అభిమానులు కోరుకున్న విధంగానే ఇందులో బాలయ్యను చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఊర్వశి రౌతేలాతో పాటు మరో ఇద్దరు హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. అలానే బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్ ఇందులో విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రానికి థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ, సౌజన్య కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ అంచనాలు ఓ రేంజ్‌లో పెంచేశాయి. ముఖ్యంగా గతంలో రిలీజ్ అయిన గ్లింప్స్‌లో బాలయ్య ఊరమాస్ యాక్షన్ చూసిన అభిమానులు ఈ సినిమా పక్కా హిట్ అంటూ ఫిక్స్ అయిపోయారు. ఆ గ్లింప్స్‌లో బాలయ్య ఊచకోత ఓ రేంజ్‌లో ఉంది. విలన్‌లను వేటాడుతున్న తీరు అబ్బో అదిరిపోయిందనే చెప్పాలి. అతడి డైలాగ్ డెలివరీ, స్వాగ్ అంతా దుమ్ము రేగిపోయింది. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. కాగా ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ సినిమా తాజా షెడ్యూల్ జైపూర్‌లో పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో బాలయ్య పాల్గొన్నాడు. ఈ విషయాన్ని దర్శకుడు బాబీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. జైపూర్‌లో తాజాగా ఫైట్ సీన్స్ షూటింగ్ పూర్తయిందని తెలిపాడు. బాలయ్య ఎప్పుడూ ఒకే ఎనర్జీతో ఉంటారని.. మోస్ట్ పవర్‌ఫుల్ సీన్లలో బాలయ్య ఆవేశాన్ని చూసేందుకు రెడీగా ఉండాలని తెలిపాడు. ఈ మేరకు అతి త్వరలో ఈ సినిమా టైటిల్‌ను వెల్లడిస్తామని చెప్పుకొచ్చాడు.

## ఐశ్వర్య రాయ్‌తో విడాకుల వార్తలపై క్లారిటీ ఇచ్చిన అభిషేక్ బచ్చన్

### ఇష్టానికి వార్తలు రాస్తుంటారు..సెలెబ్రిటీలం కదా.. భరించాలి: అభిషేక్

**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ దంపతులు విడిపోయారంటూ కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ రూమర్లపై అభిషేక్ బచ్చన్ స్పందించాడు. పెళ్లి ఉంగరాన్ని చూపించిన ఆయన తాము కలిసే ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు 'బాలీవుడ్ యూకే మీడియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడు స్పష్టత ఇచ్చాడు. ''ఆ విషయం గురించి మీ అందరితో నేను మాట్లాడాల్సింది ఏమీ లేదు. దురదృష్టం కొద్దీ ఈ విషయాన్ని అంతటా వ్యాపింపజేశారు. కానీ మీరు ఇలా ఎందుకు చేస్తారో నాకు తెలుసు. మీరు కొన్ని కథనాలు రాయాలి కాబట్టి రాశారు. కానీ ఏం ఫర్వాలేదు. మేము సెలబ్రిటీలం కాబట్టి దానిని భరించాలి'' అని అభిషేక్ బచ్చన్ వ్యాఖ్యానించాడు. కాగా అభిషేక్ బచ్చన్-ఐశ్వర్య రాయ్ బచ్చన్ దంపతులు విడాకులు తీసుకున్నారంటూ కొంతకాలంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ విషయంపై తెగ ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన అనంత్ అంబానీ పెళ్లికి ఇద్దరూ వేర్వేరు హాజరయ్యాక ఈ పుకార్లు మరింత ఊపందుకున్నాయి. దీనికి తోడు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా 'గ్రే డైవర్స్'కు (50 ఏళ్లు పైబడినవారు విడాకులు తీసుకోవడం) సంబంధించిన పోస్టుకు అభిషేక్ బచ్చన్ లైక్ కొట్టడంతో విడాకుల అనుమానాన్ని మరింత బలపరిచింది. అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ 2007లో పెళ్లి చేసుకున్నారు. నవంబర్ 2011లో వారికి ఆరాధ్య పుట్టింది. కాగా ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 17వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెళ్లి ఫొటోలను ఐశ్వర్య సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. కాగా వివాహానికి ముందు గురు, ధాయ్ అక్షర్ ప్రేమ్ కే, కుచ్ నా కహో, ధూమ్-2, ఉమ్రావ్ జాన్ సినిమాలలో ఇద్దరూ జంటగా నటించారు.

## వేణు స్వామిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు



**విశ్వంభర, సినిమా:** సోషల్ మీడియాలో ఫిల్మ్ సెలబ్రిటీస్ పై వ్యాఖ్యలు చేస్తూ పాపులర్ అయిన వేణు స్వామి ఈ మధ్య జరిగిన అక్కినేని నాగచైతన్య - శోభిత ధూళిపాళ ఎంగేజ్మెంట్ రోజున వారి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో పెనుధుమారం లేపింది. అసలు వ్యక్తి గత విషయాలు నలుగురి లో మాట్లాడ కూడదు అనే ఇంగిత జ్ఞానం కూడ లేని వేణుస్వామి వాళ్ళు ఎప్పుడు విడి పోతారో కూడా చెప్పేసాడు. గతం లో సినిమా రిలీజ్ లపై, రాజకీయ ఫలితాలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి అభాసు పాలు అయినా కూడ బుద్ధి రాని వేణుస్వామి నాగ చైతన్య - శోభిత లపై అలాంటి వ్యాఖ్యలే చేసాడు. అతనిపై చర్యలు తీసుకోవాలి అని కోరుతూ.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ మరియి తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ తెలంగాణ స్టేట్ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శ్రీమతి నీరెళ్ల శారద గారికి కలిసి పిర్యాదు చేసారు. ఈ విషయం పై స్పందించిన ఛైర్ పర్సన్ శ్రీమతి నీరెళ్ల శారద గారు వేణుస్వామి పైన మరియు టెలికాస్ట్ చేసిన యూట్యూబ్ చానల్స్ పైన తప్పకుండా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. వేణుస్వామి ని పిలిపించి అతని వివరణ అడుగుతామని అన్నారు. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ, జనరల్ సెక్రటరీ వై.జె.రాంబాబు, ట్రెజరర్ సురేంద్ర కుమార్ నాయుడు, ప్రసాదం రఘు, లక్ష్మీ (V6),తో పాటు తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ నుండి ప్రెసిడెంట్ ప్రేమమాలిని వనం, సెక్రటరీ వేదుల మూర్తి, మెంబెర్స్ సువర్ణ, తేజస్విని సజ్జ, భాగ్యలక్ష్మి, యస్.కుమార్ మరియు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వనజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'కల్కి' రికార్డులను బ్రేక్ చేసిన 'స్త్రీ 2'



**విశ్వంభర, సినిమా :** బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ లీడ్ రోల్ నటించిన సినిమా 'స్త్రీ- 2'. ఈ సినిమా ఆగస్టు 15న రిలీజ్ కానుంది. తాజాగా సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'స్త్రీ- 2' బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి' అడ్వాన్స్ బుకింగ్‌స్‌ల కలెక్షన్లను దాటేసింది. ఇప్పటికే రూ.20 కోట్లకు పైగా వచ్చినట్లు మూవీయూనిట్ పేర్కొంది. ఈ జోరు ఇలాగే కొనసాగితే ఫస్ట్ డే కలెక్షన్లు కూడా భారీ స్థాయిలో రావడం పక్కా. అయితే బాలీవుడ్‌లో ఆగస్టు 15న విడుదల కానున్న చిత్రాలన్నిటి అడ్వాన్స్ బుకింగ్స్ కంటే 'స్త్రీ-2'కే ఎక్కువ రావడం విశేషం. కాగా, ఈ సినిమాలో రాజ్‌కుమార్ రావు నటించారు. డైరెక్టర్ అమర్‌కౌశిక్ కామెడీ, హారర్ జానర్‌లో ఈ మూవీ తెరకెక్కించారు. ఇక రీసెంట్‌గా రిలీజైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది.

## సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో 2024 ఆగస్టు 12 నుంచి 18వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించబడుతోంది. ఈ ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, డిజైనర్లు, చేనేత ఔత్సాహికులను ఒకచోట చేర్చి, చేనేత నేత యొక్క గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడానికి ఒక ప్రత్యేక వేదికను అందిస్తుంది. టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ అశ్విని శ్రీ, నిర్వాహకులు సోమనాథ్ బౌమిక్, అభిజిత్ షాలతో కలిసి ఎక్స్‌పోను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ భారతదేశపు సుసంపన్నమైన, విభిన్నమైన చేనేత సంప్రదాయాల గొప్ప వేడుక అయిన సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 2024లో ఇక్కడకు రావడం నాకు ఎంతో ఆనందగా ఉందన్నారు. ఈ కార్యక్రమం మన సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా నిలవడానికి దోహదపడుతుందన్నారు. ఈ ఎక్స్‌పో చేనేత కళాకారుల ప్రతిభకు తార్కాణమే కాకుండా నేరుగా నేత కార్మికులతో అనుసంధానం చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించే వేదిక అన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అని తెలిపారు. సోమనాథ్ మాట్లాడుతూ బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించే సిల్క్ ఆఫ్ ఇండియా ప్రాంతం అంతటా 50+ మాస్టర్ వీవర్స్, 20+ రాష్ట్రాలు నుంచి చేతితో నేసిన వస్త్రాలు, సాంప్రదాయ చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేయబడిందని తెలిపారు. చీరలు, స్కార్ఫ్‌లు, బట్టలు, గృహ వస్త్రాలు, మరెన్నింటితో సహా అనేక రకాల చేనేత ఉత్పత్తులను అన్వేషించండి, ఇవన్నీ సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి నైపుణ్యం కలిగిన నేత కార్మికులు రూపొందించారు అని చెప్పారు. మా ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం గౌరవంగా ఉందని అభిజిత్ చెప్పుకొచ్చారు. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలు బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జామ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి మొదలైనవి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

## సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగో ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** 2024 సోషల్ మీడియా అవార్డ్స్ వివిధ ప్లాట్‌ఫారంలలో సోషల్ మీడియా అమలులో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించడానికి రూపొందించబడ్డాయి. అత్యంత సృజనాత్మక, వినూత్నమైన, ప్రభావవంతమైన, ఇన్‌ఫ్లుయెన్సర్‌లు గత సంవత్సరంలో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సృష్టించిన సోషల్ మీడియా ప్రచారాల నుంచి వర్గాలతో. కళారాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లిమిటెడ్. అతిపెద్ద ప్రభావశీలులు, సినీ కళాకారులు, షార్ట్ ఫిల్మ్‌మేకర్‌లు, దర్శకులు, ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌లు, యూట్యూబర్‌లను ఏకతాటిపైకి తీసుకురావడానికి అసమానమైన ఈవెంట్‌పై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ (SMSF 2024)ని సగర్వంగా అందజేస్తుంది. SMSF ఈ ఇన్‌ఫ్లుయెన్సర్‌లను గుర్తించి, అవార్డ్‌లు మరియు రికగ్నిషన్‌లతో సత్కరిస్తుంది. అక్టోబర్, 2024లో షెడ్యూల్ చేయబడిన అద్భుతమైన అవార్డు ప్రదానం కార్యక్రమం. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో కలారాజ్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మర్రి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లతో కలిసి సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మర్రి మాట్లాడుతూ కళారాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. Ltd., దాని వినూత్న విధానం, శ్రేష్ఠత పట్ల నిబద్ధతకు ప్రసిద్ధి చెందింది, నెట్‌వర్కింగ్ మరియు సహకారం కోసం శక్తివంతమైన వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ ఈవెంట్‌ను నిశితంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణల కలయికకు ఈ వేదిక సాక్షి అన్నారు. డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ భవిష్యత్తును తీర్చిదిద్దే మరపురాని అనుభవం కోసం తమతో చేరాలని తెలిపారు. SMSF 2024 డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ల్యాండ్‌స్కేప్‌లో ల్యాండ్‌మార్క్ ఈవెంట్‌గా ఉంటుందని వాగ్దానం చేశారు.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS విశ్వంభర తెలుగు దినపత్రిక
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com